
గురుకులాల నుంచి డీఎస్సీకి..

- ఉపాధ్యాయులుగా ఎంపికైన రెసిడెన్షియల్ టీచర్లు
- బడులకు వెళుతున్న 120 మంది..
- కేజీబీవీ, గురుకులాల్లో భారీగా ఖాళీలు 7
- తమకు ప్రాధాన్యం ఇవ్వాలంటున్న పాత కాంట్రాక్టు అభ్యర్థులు

జలారణ్యం..

అడవి ఒడిలో జలగీతం



బొదనెల్లి సమీపంలో కట్ట నిర్మాణం

నీటి నిల్వలో ఇంజనీర్లను తలపిస్తున్న గిరిపుత్రులు

- మట్టి కట్టలతో నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌లను పోలిన జలాశయాల నిర్మాణం
- స్వశక్తితో సాగునీటికి 'నిల్వ' నేర్పుతున్న ఆదివాసులు
- గిరిజన గూడాల్లో జోరుగా సాగుతున్న వ్యవసాయం
- యాసంగికి కూడా అందనున్న నీరు



అటవీగ్రామాల్లో పచ్చగా కళకళలాడుతున్న పొలాలు

చర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అక్కడ ప్రభుత్వం నిర్మించిన చెక్‌డ్యామ్‌లు, ఎత్తిపోతల పథకాలు లేవు.. కానీ పంట పొలాల్లో ఎక్కడ చూసినా నీరే కనిపిస్తోంది. ఆ పల్లెల్లో 24 గంటల కరెంటు మోటార్లు లేవు.. అయినా పచ్చని పంటలకు కొదువలేదు. చీమలు దూరని చిట్టడవులు, కాకులు దూరని కారడవుల్లాంటి ఏజెన్సీలో మన్యం ప్రజలు తమ మేధస్సుతో ఇంజనీర్లను తలపిస్తున్నారు. ప్రకృతి ఒడిలో తమకు సహజంగా అబ్బిన విజ్ఞానంతో వారు వాన నీటిని ఒడిసి పట్టుకొని పంటలు పండిస్తున్నారు. మట్టితో కుంటలు, చెక్‌డ్యామ్‌ల లాంటి నిర్మాణాలను చేపట్టి ఔరా అనిపిస్తున్నారు. నీటి వాలుకు మట్టి కట్టలు కట్టడంతో అవి చిన్నపాటి కుంటలుగా జలవనరులయ్యాయి. ఏడాది పాటు పంటలకు జీవం పోస్తున్నాయి. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఆశ పడకుండా చర్ల మండలంలో ఆదివాసీలు స్వయం శక్తితో నీటి నిల్వ చేస్తున్న తీరు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

అటవీ గ్రామాల్లో 'సాగు'తుందిలా...

చర్ల మండలంలోని అటవీ గ్రామాల్లో ఆదివాసీలు అధికంగా వరితో పాటు ఇతర పంటలను పండిస్తుంటారు. ఏటా చెన్నాపురం, బత్తినిపల్లి, ఎర్రంపాడు, బక్కచింతల పాడు, కొర్కట్‌పాడు, కొండెవాయి, ఎర్రబోరు, క్రాంతిపురం, కందిపాడు, ఉయ్యాల మడుగు, రామచంద్రుని కుంటతోపాటు మరి కొన్ని గ్రామాల్లో సుమారు 9వేల ఎకరాల్లో పంటను పండిస్తారు. వరితో పాటు పత్తి, మిర్చి పంటలను సాగు చేస్తారు. పంట చేతికి వస్తున్న తరుణంలో నీటి సదుపాయం లేక పంటలు ఎండి పోతున్నాయి. చెరువులు, ఎత్తిపోతల పథకాలు లేకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయి.

నీటి నిల్వ ఆలోచనకు పదును

వర్షాలు లేక అన్నం పెట్టే పంట ఎండుతుండటంతో నీటి నిల్వల కోసం ఆదివాసీ రైతులు ఆలోచనలకు పదును పెట్టారు. అడవుల్లో సాగుభూముల ప్రాంతాల్లో మట్టి కట్టడాలు కట్టాలని నిర్ణయించుకున్నారు. నీరు ధారాలంగా ప్రవహించే ప్రాంతాల్లో మట్టితో ప్రాజెక్టు లాంటి (మిగతా 6వ పేజీలో)

దేశం చూపు సర్వే వైపు..

- ఎన్యుమరేటర్లు పకడ్బందీగా నిర్వహించాలి
- కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సర్వే పత్రంపై కుటుంబ బాధ్యుల సంతకం తీసుకోవాలి: భద్రాద్రి కలెక్టర్



కొత్తగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వే నేపథ్యంలో కలెక్టర్లు ఎన్యుమరేటర్లతో విస్తృతంగా మాట్లాడాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి కలెక్టర్ జితేష్ వి.పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి పాల్గొన్నారు. ఎన్యుమరేటర్లతో ఎప్పటికప్పుడు కలెక్టర్లు మాట్లాడితే ప్రజల సందేహాలు ఏమిటో తెలుసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజల సందేహాలను కలెక్టర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని ఆదేశించారు. 'ఈ దేశంలో జరిగే అతిపెద్ద కార్యక్రమం ఇది.. మనం చూపే నిబద్ధతపైనే ఈ సర్వే విజయవంతం కావడం ఆధారపడి ఉంటుంది. యావత్ దేశం నేడు తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న కుటుంబ సర్వేను గమనిస్తున్నది. ఈ దేశంలో ప్రగతిశీల భావాలను, కార్యక్రమాలను వ్యాప్తి చేయడానికి ఈ సర్వే గొప్పగా ఉపయోగపడుతుంది.. అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ శాంతకుమారి, ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్

క్షేత్రస్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో భాగంగా ప్రతి ఎన్యుమరేటర్ ప్రతి కుటుంబం సమాచారాన్ని కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచాలన్నారు. ప్రతి ఎన్యుమరేటర్ సేకరించిన సమాచారం వారికి కేటాయించిన కేంద్రాల వద్ద డేటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. సర్వే సమయంలో (మిగతా 6వ పేజీలో)



ఎమ్మెల్యే వెంకటరావు ఇంట్లో....

భద్రాచలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు ఇంటి వద్ద శనివారం సమగ్ర కుటుంబ సర్వే బృందం అధికారులు కుటుంబ వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రజలంతా ప్రభుత్వ ఆలోచనకనుగుణంగా సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలని కోరారు.

భద్రాచలంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్, డీసీసీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్యతో పాటు వారి కుటుంబ సభ్యుల వివరాలను రెవిన్యూ అధికారులు సేకరించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ సర్వేకు ప్రజలంతా సహకరించాలని కోరారు.

సర్వే బృందాలకు సహకరించండి...

- ప్రశ్నావళిలో అడిగిన సమాచారం ఇవ్వండి
- ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ సురేంద్రమోహన్
- అన్నవరం గ్రామంలో సమగ్ర సర్వే పరిశీలన
- వృద్ధుడి ఇంట్లోకి వెళ్లి భరోసా



సురేంద్రమోహన్‌కు గ్రామ సమస్యలు వివరిస్తున్న స్థానికులు

కొణిజర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను) పకడ్బందీగా నిర్వహించాలని, ప్రజలు సర్వే బృందానికి సమాచారం క్లుప్తంగా ఇచ్చి సహకరించాలని సమగ్ర సర్వే ఉమ్మడి ఖమ్మంజిల్లాల స్పెషల్ ఆఫీసర్, ఐఏఎస్ సురేంద్రమోహన్ కోరారు. శనివారం మండలంలోని అన్నవరం గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేకు సంబంధించి ఇంటి యాజమానితో మాట్లాడారు. సర్వే వల్ల ఇబ్బంది కలుగుతుందా, అన్ని సక్రమంగా చెప్పుతున్నారా... అని అడిగారు. సర్వే రిపోర్టును చాలా జాగ్రత్తగా భద్రపరచాలని, ఎలక్షన్‌లో ఈవీఎంలను ఎలా జాగ్రత్త పరుస్తామో ఆ విధంగా జాగ్రత్తగా ఉంచాలని, ఆ బాధ్యత ఎన్యుమరేటర్‌తోపాటు మండల, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం వహించొద్దన్నారు.

గ్రామస్థుల సమస్యలు

ఐఏఎస్ సురేంద్రమోహన్‌కు అన్నవరం గ్రామ ప్రజలు సమస్యలను వివరించారు. గ్రామంలో కిడ్నీల వ్యాధితో బాధపడుతున్నామని, బోరునీరు మాత్రమే తాగుతున్నామని తెలిపారు. చాలా మందికి రేషన్‌కార్డులు లేవని, సొంత ఇల్లు లేక గుడిసెల్లో ఉంటున్నామని, వృద్ధాప్య, వితంతు పింఛన్లకు అర్హత ఉన్నా తమకు రావడంలేదని ఫిర్యాదు చేశారు. గ్రామానికి బస్ సౌకర్యం కల్పించాలని వేడుకున్నారు. సర్వే ద్వారా సమస్యలను సర్వే బృందానికి తెలపమని, తద్వారా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ప్రతిష్ఠాత్మక కార్యక్రమం

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాపితంగా సమగ్రసర్వేను చేపట్టిందని, ఇది ఎంతో ప్రతిష్ఠాత్మకమైందని సురేంద్రమోహన్ తెలిపారు. ఖమ్మంజిల్లాలో ఇప్పటివరకు అర్బన్ ప్రాంతాల్లో, రూరల్ ప్రాంతాల్లోని అన్ని ఇళ్లకు స్టిక్కరింగ్ చేశారని, సర్వే కూడా ప్రారంభమైందన్నారు. డీఎల్‌పీవో రాంబాబు, మండల స్పెషల్ ఆఫీసర్ రామగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ తఫ్జల్ ఇక్బాల్, ఎంపీడీవో రోజారాణి, స్థానిక ఆయాశాఖల మండలాధికారులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఇంట్లోకి వెళ్లి.. భరోసా ఇచ్చి...

కొణిజర్ల మండలం అన్నవరం గ్రామంలో కుటుంబ సమగ్ర సర్వేను పరిశీలించేందుకు శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా స్పెషల్ ఆఫీసర్, ఐఏఎస్ అధికారి సురేంద్రమోహన్ వచ్చారు. గ్రామానికి చెందిన (మిగతా 6వ పేజీలో)

అన్ని హామీలను అమలు చేస్తాం

మిగిలిన రైతులకు రుణమాఫీ చేస్తాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి చూపిస్తుందని పాలేరు శాసనసభ్యుడు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పడిన 27 రోజుల్లోనే రూ.18వేల కోట్ల రుణమాఫీ చేసిందని, మిగిలిన అర్హత గల రైతులకు రూ.13వేల కోట్లను డిసెంబరు చివరికల్లా రుణమాఫీ చేసి చూపిస్తామని మంత్రి చెప్పారు. గత పదేళ్ల పాలించిన ప్రభుత్వం ఒక్క ఉద్యోగమైనా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిరుద్యోగ యువతకు దాదాపు 57వేల మందికి ఉద్యోగాలిచ్చామన్నారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలను నిర్వహించామన్నారు. రాష్ట్రం ఆర్థికంగా అనేక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అన్ని పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కల్యాణలక్ష్మికి తులం బంగారం ఇస్తామన్న హామీని సైతం త్వరలోనే అమలు చేస్తామని శ్రీనివాసరెడ్డి అన్నారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీవో నర్సింహారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీది మతోన్మాద రాజకీయం

- దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారు : పోతినేని



అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న పోతినేని

ఖమ్మం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ హిందూ మతోన్మాదాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయ పబ్బం గడుపుకొంటున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శనరావు విమర్శించారు. 2005లో మణుగూరులో సీపీఎం జిల్లామహాసభకు హాజరై తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు అమరవీరుల జ్ఞాపకార్థం నిర్మించిన స్థూపాన్ని శనివారం ఖానాపురం హవేలిలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం టేకులపల్లిలో నిర్వహించిన ఖానాపురం హవేలి మండల మహాసభలో మాట్లాడుతూ అయోధ్యలో బీజేపీ అభ్యర్థిని ప్రజలు తిరస్కరించినా బీజేపీ ప్రభుత్వం తీరు మార్చుకోలేదన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చినా నల్లధనం వెలికి తీయకపోగా దేశసంపదను బడా కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారన్నారు. మతం పేరుతో కల్లోలాలు సృష్టిస్తున్న బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ హామీగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సీపీఎం మండల కార్యదర్శి దొంగల తిరుపతి రావు నివేదికను ప్రవేశపెట్టగా, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, కళ్యాణం వేంకటేశ్వరరావు, వై. విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మల్లయ్య సాగు.. లాభాలు బాగు

- 20 ఏళ్లుగా కూరగాయల సాగులో రాణిస్తున్న రైతు
- అధిక దిగుబడులతో ఆదర్శం
- టమాటా, బెండ, దోసకాయలకే మొగ్గు
- ఎకరానికి తోడు మరో మూడెకరాలు కౌలుకు.. 6



భవిష్యత్తు న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌లదే..

- త్వరలో బొగ్గు రహిత న్యూక్లియర్ ప్లాంట్‌ల ఏర్పాటు
- అణుశక్తి విభాగంలో మణుగూరు హెవీ వాటర్ కీలకపాత్ర 6
- హెవీ వాటర్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.సత్యకుమార్



స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారు..

- పంచాయతీలకు నిధులు, విధులు, అధికారాలు ఇవ్వాలి
- స్థానిక సంస్థల మనుగడ కోసం దేశవ్యాప్త ఆందోళనలు
- పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు వై.బాబూ రాజేంద్రప్రసాద్ 6

20ఏళ్లుగా కూరగాయల సాగు...

» లాభాలను గడిస్తున్న ఆదర్శ రైతు మల్లయ్య

మధిరరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటలు వేసి నష్టాలతో ఇబ్బందులు పడ్డ ఓ రైతు కూరగాయల సాగును ఎంచుకొని 20 ఏళ్లుగా కూరగాయల పంటలు సాగుచేస్తూ లాభాలు గడిస్తూ ఆదర్శ రైతుగా నిలబడ్డాడు. ఇతనే మధిర మునిసిపాలిటీ పరిధిలోని అంబారుపేట గ్రామానికి చెందిన రైతు యర్రం నాగమల్లేశ్వరరావు (మల్లయ్య). అంబారుపేటకు మల్లయ్యకు ఎకరం పొలం మాత్రమే ఉంది. దానికి తోడు రెండు, మూడెకరాలు కౌలుకు తీసుకొని కూరగాయ సాగు చేస్తున్నాడు. అంతకుముందు


కూరగాయలను మార్కెట్‌కు తరలిస్తున్న రైతు మల్లయ్య

వాణిజ్య పంటలు వేసేవాడు. తరచూ నష్టాలు రావడంతో విసిగివేసారి కూరగాయల సాగువైపు దృష్టిసారించాడు. 2004 నుంచి కూరగాయల పంటలు సాగుచేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాడు. ఇతనికున్న ఎకరం పొలంలో బోరు ఉంది. దీంతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని కూరగాయల సాగు చేయటం మొదలుపెట్టాడు. కూరగాయల సాగు ప్రారంభం నుంచి ఎటువంటి నష్టాలు లేకుండా లాభంతోనే ముందుకు సాగుతున్నాడు.

పలురకాల కూరగాయల పంటలు సాగు...

ఈ రైతు బెండ, టమాటా, దోసకాయ పంటలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వీటిని సాగుచేస్తున్నాడు. తనకున్న ఎకరంతో పాటు మిగతా పొలాన్ని ఎకరాకు రూ.15వేల చొప్పున కౌలు చెల్లించి ఈ పంటలు సాగుచేస్తున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలంలోనే ఉంటూ కష్టపడుతూ కూరగాయల పంటలు పండించి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ప్రతి సంవత్సరం మూడు నుంచి నాలుగు రకాల పంటలు వేస్తుంటాడు. ఈ సంవత్సరం నాలుగెకరాల పొలంలో బెండ సాగు, ఎకరంన్నరలో దోసకాయ సాగు చేపట్టాడు. బెండలు, దోసకాయ విత్తనాలు వేసి నాటుతుండగా టమాటాను మాత్రం నారు తీసుకువచ్చి వేస్తున్నాడు. ప్రస్తుతం బెండ బాగా కాసింది. బెండలు ఎకరాకు వంద క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు రైతు తెలిపాడు. దోసకాయలు కూడా ఎకరాకు 80 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తున్నట్లు తెలిపాడు. రెండెకరాల్లో టమాటా పంట వేసేందుకు సిద్ధం చేశాడు.

ద్విచక్రవాహనంపైనే మార్కెట్‌కు...

అంబారుపేటలో తాను పండించిన కూరగాయలను ప్రతిరోజూ తన ద్విచక్రవాహనంపైనే మధిర మార్కెట్‌కు తరలిస్తుంటాడు. ఈ గ్రామం నుంచి మధిర పట్టణం రెండు కిలోమీటర్ల


బెండకాయలు కోస్తున్న కూలీలు

దూరం ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు మార్కెట్‌కు సరఫరా చేస్తుంటాడు. పెద్దమొత్తంలో పంట ఉన్నప్పుడు ఆటో ద్వారా ఖమ్మం తరలిస్తుంటాడు.

అధిక దిగుబడులు...లాభాల బాట

ఈ రైతు ఆది నుంచి కూరగాయల పంటల్లో మంచి దిగుబడులు సాధిస్తున్నాడు. ఈ 20ఏళ్లల్లో ఒకట్రెండు సంవత్సరాల మధ్యలో సరిసమానమైన ఎక్కువ సంవత్సరాల్లో ఎంతోకొంత కూరగాయలు వేసి లాభాలను ఆర్జించాడు. దిగుబడులు సాధించటంతోపాటు లాభాలను ఆర్జించటంలోనూ ఈరైతుకు మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. అంబారుపేటతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో కూరగాయల సాగు అంటే రైతు నాగమల్లేశ్వరరావు(మల్లయ్య) గుర్తుకు వస్తుంటాడు. మొత్తంమీద కూరగాయల సాగులో 20ఏళ్లుగా రాణిస్తూ పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

కష్టానికి తగిన ఫలితం వస్తుంది...

యర్రం నాగమల్లేశ్వరరావు(మల్లయ్య), కూరగాయల రైతు, అంబారుపేట

20ఏళ్లుగా కూరగాయల పంటలు పండిస్తున్నా. ఈ సాగు నాకు సంతృప్తినిచ్చింది. పడిన కష్టానికి ఫలితం లభించింది. ఇప్పటివరకు ఏనాడూ నష్టం రాలేదు. ఆర్థికంగా ఎటువంటి లోటు లేకుండా సంతోషంతో ముందుకు వెళ్తున్నా. ముఖ్యంగా టమాటా, బెండ, దోస సాగు అంటే ఇష్టం. మంచి దిగుబడులు వస్తాయి.

ముత్యాల కవచాలంకారంలో శ్రీవారు


శ్రీపాదం వద్ద కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి శనివారం సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రమైన శ్రావణా నక్షత్రంతో శనివారం కలిసి రావడంతో ఆలయంలో భక్తులరద్దీ ఎక్కువగా ఉంది. కార్తీకమాసం కావడంతో భక్తులు ఆలయ ఆవరణలో శ్రీపాదం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకల్యాణం నిర్వహించారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు సేవా సమితి నిర్వాహకులు అన్న గోవిందంలో భాగంగా భక్తులకు ఉచితంగా అన్నవితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో కె.జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, అర్చకులు ఉప్పల రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, చక్రధరశర్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

డీఆర్‌డీవో సన్యాసయ్య


వీఎం బంజరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డీఆర్‌డీవో

పెనుబల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించాలని డీఆర్‌డీవో సన్యాసయ్య ఆదేశించారు. శనివారం పెనుబల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, నీడ ఏర్పాటు చేయడంతోపాటు రైతులు తెచ్చిన ధాన్యాన్ని సకాలంలో కాంటాలు వేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సన్న, లావు రకాలకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటుచేశామని, వీటితోపాటు సన్నరకాలకు ఎరుపు, లావు రకాలకు ఆకుపచ్చ బ్యాగ్‌లను వేసి వేర్వేరుగా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. రైతులు పండించిన సన్నరకాలకు క్వింటాకు రూ.2320తోపాటు రూ.500బోనస్ అందజేస్తామని రైతులు దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణ, ఏపీఎం నాగపుల్లారావు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, గ్రామ సమాఖ్యలు, ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దు

తల్లాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దని డీసీవో గంగాధర్ సూచించారు. శనివారం తల్లాడ మండలంలోని బిల్లుపాడు, అంజనాపురం, గొల్లగూడెం, తల్లాడల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని తూర్పారపట్టి 17శాతంలోపు తేమ ఉండేటట్టు ఎండబెట్టి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి అమ్ముకోవాలన్నారు. సన్నరకం ధాన్యం క్వింటాకు అదనంగా ప్రభుత్వం రూ.500బోనస్ అందజేస్తుందని వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు శ్రీనివాసరావు, నాగమహేశ్వరి, సొసైటీ చైర్మన్లు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, తూము వీరభద్రరావు, సీతవేలు నాగబాబు, రాకేష్ రాజు, పలువురు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భగవంతుని కరుణ.. పల్లానికి ప్రవహించే నీరు వంటిది..


ప్రవచనం అందిస్తున్న వంగల వెంకటాచార్యులు

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భగవంతుని కరుణ పల్లానికి ప్రవహించే నీరు వంటిదని విద్వాన్ వంగల వెంకటాచార్యులు అన్నారు. ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంపు రామాలయం (రామగిరి)లో జరుగుతున్న ఆళ్వార్ల వైభవ ప్రవచన కార్యక్రమంలో భాగంగా శనివారం పలువురు వేద పండితులు పలు అంశాలపై పాశురాలను ప్రవచించారు. కార్యక్రమంలో భాగంగా నర్సాపురం నుంచి హాజరైన వంగల వెంకటాచార్యులు భూతయోగి పూదత్తాళ్వార్ వైభవాన్ని ప్రవచిస్తూ.. భగవంతుని కరుణా కటాక్షాలు అట్టడుగు వర్గాలకూ అందుతాయన్నారు. నీరు ఏవిధంగా పల్లపు ప్రాంతాలను తడుపుతుందో అదే విధంగా భగవంతుని దయ కూడా కిందిస్థాయికి ప్రవహిస్తుందన్నారు. భగవంతుని దృష్టిలో ధనిక పేద, ఎక్కువ, తక్కువ తారతమ్యం ఉండదన్నారు. అందరినీ సమదృష్టితో చూసే గుణం భగవంతుడిదన్నారు. ఆళ్వార్లు సైతం అదేవిధంగా భగవత్ తత్వాన్ని కలిగి ఉంటారన్నారు. వారు పరమాత్ముని ఆత్మలుగా అభివర్ణించారు. అనంతరం కండ్లకుంట కోదండరామాచార్యులు (ఖమ్మం) నమ్మాళ్వార్ వైభవంపై పాశం శ్రీనివాసాచార్యులు (విశాఖ పట్నం) విష్ణుచిత్తులు పెరియాళ్వార్ గురించి జానకీదేవి (బెంగుళూరు) గోదాదేవి వైభవం గురించి ప్రవచించారు.

హత్యాచార బాధ్యులను శిక్షించాలి

» రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం డిమాండ్

ఖమ్మంటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి దారుణంగా హత్యచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి డిమాండ్ చేశారు. నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలో శనివారం ఎస్‌కే.మెహరున్నీసా బేగం అధ్యక్షతన ఐద్వా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సరళ, భారతిలు మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌లోని ఆర్జికార్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య జరిగి మూడునెలలు గడుస్తున్నా ఇంతవరకు దోషులను గుర్తించి, శిక్షించకపోవటం పలు అనుమానాలకు తావిస్తున్నదన్నారు. అక్కడి అధికార పార్టీ అండతో అత్యాచారాలకు పాల్పడుతున్న వారిని శిక్షించకపోవటంతో మహిళలపై అత్యాచారాలు, హింస పెరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం తక్షణం దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రతిరోజు మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని,


మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ

బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మరింతగా పెరిగాయన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ల బిల్లును తక్షణం ఆమోదించాలని, మహిళల రక్షణకు బడ్జెట్‌లో 25శాతం నిధులు కేటాయించాలని, చట్టాలను కఠినతరం చేసి అత్యాచార నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని డిమాండ్ చేశారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, జిల్లా నేతలు బాగం అజిత, సునీత, బొడ్డు పద్మ, బీబీ, స్థానిక నేతలు కౌసర్, స్వాతి, నస్రీన్, విజయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశం చూపు సర్వే వైపు..

(5వ పేజీ తరువాయి)

ఆధార్, ధరణి పాస్‌బుక్, పాన్, రేషన్‌కార్డు, సెల్‌ఫోన్ నెంబర్లు కూడా నమోదు చేయాలని, ఆయా పత్రాలు దగ్గర ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఒక్కో కుటుంబ వివరాల సేకరణకు 10-20 నిమిషాలు పట్టే అవకాశం ఉందని, పత్రాలు దగ్గర ఉంటే ఎన్యుమరేటర్లు వచ్చినప్పుడు వివరాలు చెప్పడం సులభం అవుతుందని, మొత్తం వివరాలు పూర్తయ్యాక తాను చెప్పిన వివరాలన్నీ నిజమేనని ప్రకటిస్తున్నట్లుగా కుటుంబ యజమాని సంతకం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో సంజీవరావు, కలెక్టరేట్ ఏవో రమాదేవి, అధికారులు తదితరులున్నారు.

సర్వే బృందాలకు సహకరించండి

(5వ పేజీ తరువాయి)

బత్తుల లక్ష్మయ్య అనే వృద్ధుడు... సురేంద్రమోహన్‌కు దండం పెట్టి తనకు ఇల్లు లేదని, పూరిగుడిసే దిక్కని, ఇల్లు కావాలని వేడుకున్నాడు. అంతటితోనే వదిలిపెట్టకుండా సురేంద్రమోహన్‌ను తన గుడిసె వద్దకు తీసుకెళ్లాడు. వృద్ధుడి కోరికను, బాధను అర్థం చేసుకున్న అతను అతడి ఇంటి వద్దకు వెళ్లాడు. లక్ష్మయ్య ఇంట్లిలోకి వెళ్లి తన ఆధార్‌కార్డును చూపించాడు. తనకు తినటానికి కూడా తిండిలేదని నానా ఇబ్బందులు పడుతూ జీవిస్తున్నానని తనకు ఇల్లు మంజూరు చేయాలని కోరాడు. దాంతో సురేంద్రమోహన్ స్పందించి వృద్ధుడి ఆధార్‌ను సెల్‌ఫోన్ ద్వారా ఫొటో తీసుకున్నారు. సర్వేలో సమాచారం ఇస్తే నిబంధనల ప్రకారం ఇల్లు తప్పకుండ వస్తుందని భరోసా నింపారు. దాంతో వృద్ధుడు సంతోషపడ్డాడు.

అడవిబిడ్డలో జలగీతం

(5వ పేజీ తరువాయి)

నిర్మాణాలు చేపట్టారు. మట్టితో బలంగా కట్టలను పోశారు. కుంటలను తవ్వి నీటిని నిల్వ చేశారు. ఆ నిర్మాణాల అడుగు భాగాన పైపులు పెట్టి పంట పొలాలకు నీటిని మళ్లిస్తున్నారు. నీటి సదుపాయం ఉండటంతో ఈ ఏడాది పంటలు అధికంగా పండాయి. ఎక్కడ చూసినా పచ్చని పైర్లు కనిపిస్తున్నాయి. కాగా ఒకసారి ఈ నీటి కుంటలు నిండితే ఒక సీజన్ పంటకాలానికి సరిపోతాయని రైతులు చెబుతున్నారు.

ఆదివాసీలకు వరి సాగే జీవనాధారం. పంటలను సాగు చేసి వచ్చిన ధాన్యాన్ని నిల్వ చేసుకుంటారు. గ్రామంలోని కొంత మంది సభ్యులు ఐకమత్యంగా కుంటలు, మట్టితో చెక్‌డ్యాం లాంటి నిర్మాణాలను కట్టుకుంటున్నారు. మరికొంత మంది ఉపాధి హామీ పనుల్లో కూడా వీటిని నిర్మించుకుంటున్నారు. ప్రతీ ఏడాది జనవరిలో మట్టి ప్రాజెక్టులు ప్రారంభించి వర్షాలు కురిసే లోగా పూర్తి చేస్తున్నారు. ఈ ఏడాది వానాకాలం పంటలు పండగా, యాసంగి కూడా తమ జలాశయాల్లోని నీరు సరిపోతుందని ఆదివాసీలు అంటున్నారు.

చందాలు వసూలు చేసి మాకు ఇవ్వలేదు

● విలేకరుల సమావేశంలో గోడు వెళ్లబోసుకున్న బాధితులు

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరెంట్‌షాక్‌తో కాలిపోయి ఉన్న తమ కొడుకుకి ఆర్థికసాయం పేరుతో వసూలుచేసిన సొమ్ము తమకు ఇవ్వలేదని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని బాధితురాలు పెంతల శోభ వాపోయింది. శనివారం ఖమ్మంనగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఖమ్మంరూరల్ మండలం సాయిగణేష్ నగర్ రోడ్డు నెం-14లో భర్త ఇద్దరు పిల్లలుతో కలిసి అద్దెకుంటున్నానని తెలిపింది. గత జులై 4న డాబాపై ఆడుకుంటున్న తమ కుమారుడు భరత్‌కు ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో 70శాతం శరీరం కాలిపోయిందని, వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాదు తీసుకెళ్లామని తెలిపింది. కాగా తన కొడుకుని అడ్డంపెట్టుకుని నలుగురు వ్యక్తులు తమ కుమారుడి ఫొటోను గ్రూపుల్లోపెట్టి రూ.10లక్షల వరకు డబ్బులు వసూలు చేశారని ఆరోపించింది. దాతలు ఇచ్చిన డబ్బులు అడిగితే రూ.లక్షా 22వేలు ఇచ్చారని మాత్రమే ఇచ్చారని తెలిపింది. మిగతావి ఇవ్వకుండా, పోలీసుస్టేషన్‌లో కేసు ఎందుకు పెట్టావని బెదిరిస్తూ డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించింది. జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆమె కోరింది. ఈ సమావేశంలో మధు, భరత్‌లు పాల్గొన్నారు.

భవిష్యత్తు న్యూక్లియర్ పవర్‌ప్లాంట్‌లదే..

» త్వరలో బొగ్గు రహిత న్యూక్లియర్ ప్లాంట్‌ల ఏర్పాటు
» అణుశక్తి విభాగంలో మణుగూరు హెవీవాటర్ కీలకపాత్ర
» దేశంలో 60 శాతం హెవీవాటర్ ఇక్కడే ఉత్పత్తి
» హెవీ వాటర్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.సత్యకుమార్

అశ్వాపురం నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భవిష్యత్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌లదేనని, వాతావరణంలో కార్బన్‌డైఆక్సైడ్ శాతంను తగ్గించటమే పరిశ్రమల లక్ష్యమని హెవీ వాటర్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్(ముంబై) ఎస్.సత్యకుమార్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు హెవీవాటర్ ప్లాంట్ సందర్శనలో భాగంగా రెండోరోజు శనివారం అశ్వాపురం గౌతమీనగర్ కాలనీలో గల పర్ణశాల అతిథి గృహంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

దేశీయ ఉత్పత్తులను అభివృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా అమృత్‌కాల్-2047 లక్ష్యంగా భారత అణుశక్తి విభాగం పరిధిలోని మణుగూరు, కోటా, థాల్, అజీరా ప్లాంట్‌లలో త్వరలో బొగ్గు రహిత న్యూక్లియర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. 1991లో ఉత్పత్తి ప్రారంభించిన మణుగూరు హెవీవాటర్ ప్లాంట్ ప్రస్తుతం అణుశక్తి విభాగంలో ప్రముఖ పాత్ర వహిస్తోందన్నారు. 60 శాతం హెవీవాటర్ మణుగూరు ప్లాంట్ నుంచే ఉత్పత్తి అవుతోందని, ప్లాంట్ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే బోరాన్-10, ఆక్సిజన్-18 ప్లాంట్‌లను


సమావేశంలో మాట్లాడుతున్న హెవీ వాటర్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.సత్యకుమార్

నెలకొల్పటం జరిగిందన్నారు.

రెండో దశలో బరోడా ప్లాంట్‌లో సోడియం ప్లాంట్ ద్వారా 600టన్నులు ప్రతిసంవత్సరం ఉత్పత్తి చేస్తున్నామన్నారు. మణుగూరు ఆక్సిజన్-18 ప్లాంట్ దేశంలోనే ప్రథమమని ఈ ప్లాంట్ ద్వారా సంవత్సరానికి 10 కేజీల ఉత్పత్తి జరుగుతోందని, భవిష్యత్‌లో మణుగూరు ఆక్సిజన్ ప్లాంట్ లో దేశం మొత్తానికి అవసరమయ్యే 40కేజీల ఉత్పత్తితో పాటు మరో 60 కేజీలను ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని సీఈ వివరించారు. ఇది క్యాన్సర్ కారకాలను గుర్తించటంలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు.

అదేవిధంగా ఫార్మా రంగంతో పాటు దేశీయ ఉత్పత్తులలో హెవీవాటర్ ప్రాధాన్యతను పెంపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇందుకోసం దేశంలో 16 కంపెనీలకు హెవీవాటర్ అందించేందుకు ఒప్పందాలు జరుగుతున్నాయన్నారు. హెవీవాటర్‌ను ఇతర దేశాలకు ఎగుమతి చేయటం ద్వారా సంవత్సరానికి 83మిలియన్ అమెరికన్ డాలర్ల ఆదాయం లభిస్తోందన్నారు. భవిష్యత్‌లో మణుగూరు హెవీవాటర్ డీఏఇకి తలమానికంగా ఉండనుందన్నారు. అనంతరం గౌతమీనగర్ కాలనీలోని భారజల ఆసుపత్రిలో సిఇ మొక్కలు నాటారు. సమావేశంలో హెవీవాటర్ ప్లాంట్ జియం జగ్గారావు,డిజిఎంలు జగన్నాధశర్మ,కె.శర్మ,సిఏఓ రాజీవ్‌ప్రకాష్,ఐఆర్ఓ లత,ఏపిఓ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

సేకరించిన వివరాలను ఆన్‌లైన్ చేయాలి

» జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


ఇంటింటి సమగ్ర సర్వేలో కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఖమ్మం నగరం సారధినగర్‌లో ఎన్యుమరెటర్లు, అధికారులతో కలిసి కలెక్టర్ ఇంటింటికి తిరిగి సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే జరిగే సమయాన్ని ప్రజలకు ముందుగానే తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. సర్వేను సకాలంలో ప్రారంభించాలని, ప్రతి కుటుంబం దగ్గర పూర్తి వివరాలను సేకరించాలని, వివరాలను ఎప్పటికప్పుడు తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. సర్వే పట్ల ప్రజలకు ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కల్పించాలన్నారు. ఏ ఒక్క ఇంటిని వదలకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని, ఎటువంటి సమస్య తలెత్తినా వెంటనే పై అధికారులకు ఎన్యుమరేటర్లు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారు..

» పంచాయతీలకు నిధులు, విధులు, అధికారాలు ఇవ్వాలి
» స్థానిక సంస్థల మనుగడ కోసం దేశవ్యాప్త ఆందోళనలు
» పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు వై.బాబూ రాజేంద్రప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న యలమంచిలి బాబూ రాజేంద్రప్రసాద్

ఖమ్మం కలెక్టరేట్, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంలో పేర్కొన్న 29 అంశాలను పంచాయతీలకు తక్షణమే బదిలీ చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షుడు యలమంచిలి బాబూ రాజేంద్రప్రసాద్ కోరారు. చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా ఇవ్వవలసిన నిధులు, విధులు, అధికారాలు ఇవ్వకుండా ప్రభుత్వాలు తత్సారం చేస్తున్నాయని, కేంద్రప్రభుత్వం నిధులను కేటాయిస్తున్నా.. వాటిని ఇతర ప్రాధాన్యత కార్యక్రమాలకు మళ్లిస్తూ స్థానిక సంస్థలను ఆయా ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. జాతీయ పంచాయితీరాజ్ ఛాంబర్ జాతీయ సమావేశాన్ని శనివారం ఖమ్మం నగరంలో నిర్వహించారు. తెలంగాణ పంచాయితీ రాజ్ ఛాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్‌లకు, జిల్లా పరిషత్‌లకు రాజ్యాంగం ప్రకారం ఇవ్వవలసిన నిధులు, విధులు, అధికారాలను దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలన్నీ తమ సొంత పథకాలకు మళ్లించుకుంటూ గ్రామాల అభివృద్ధిని శూన్యం చేస్తున్నాయన్నారు. ఫలితంగా గ్రామాల్లో కనీస మౌలిక వసతులకు కూడా నోచుకోక అక్కడి ప్రజలు పట్టణాలకు వలసదారి పడుతున్నారన్నారు. గ్రామీణ ప్రజల సంక్షేమంకోసం పంచాయితీరాజ్ సంస్థల మనుగడకోసం రాజకీయాలకు అతీతంగా సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలను ఏకం చేసి దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా న్యాయబద్దంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు రాజేంద్రప్రసాద్ స్పష్టం చేశారు.

తెలంగాణ పంచాయితీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్య వ్యవస్థను ప్రభుత్వాలు పక్కదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీలకు రావాల్సిన సీనరేజీ నిధులు, 14,15వ ఆర్థిక సంఘం నిధులను తమ సొంత పథకాలకు వినియోగించి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎమ్మెల్యేలకే అధికంగా ప్రాధాన్యతను ఇచ్చి సర్పంచిలకు ప్రాధాన్యతను తగ్గించారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6500 మంది వార్డు సభ్యులు, 195 మంది సర్పంచిలు చనిపోయినా కనీసం ఉప ఎన్నికలను నిర్వహించలేదని ఒక ఎమ్మెల్యే చనిపోతే మాత్రం ఉప ఎన్నికలను నిర్వహించారని అదీ ఆ ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఇచ్చిన గౌరవమని ఎద్దేవా చేశారు.

సమావేశంలో ఇంకా తెలంగాణ పంచాయితీ రాజ్ ఛాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ పంచాయితీరాజ్ ఛాంబర్ ప్రధానకార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, పూస్కూరి అశోక్ రావు తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో జడ్పీటీసీల రాష్ట్ర అధ్యక్షుడు బెల్లం శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వనపాక లక్ష్మీముత్యాలరావు, సింగంశెట్టి సుబ్బరామయ్య, ఎ. రామకృష్ణ, వినోదాజ్, వి. ముత్యాలరావు, శ్రీశైలం, ధనంజయా యాదవ్, లొడిగ వెంకన్నయాదవ్, ముల్లంగి రామకృష్ణారెడ్డి, శశికళా యాదవరెడ్డి, శంకర్యాదవ్, తెలంగాణ రాష్ట్ర నాయకులు పురుషోత్తమరెడ్డి, శ్రీశైలం యాదవ్, ఎంపీపీల. తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సామినేని హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

మట్టి లారీల పట్టివేత

బూర్గంపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న రెండు లారీలతో పాటు ఓ ఎక్సకవేటర్‌ను రెవెన్యూ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని చెరువు సింగారం సమీపంలో గల సీతారామ ప్రాజెక్టు కాలువ నుంచి మట్టి తరలిస్తున్న లారీలను స్థానికులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు రెండు లారీలతో పాటు ఎక్సకవేటర్ స్వాధీనం చేసుకొని తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. అనుమతి లేకుండా గ్రావెల్ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దారు ముజాహిద్ హెచ్చరించారు. మోరంపల్లిబంజర గ్రామంలో అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. పోలీసు స్టేషన్‌కు తరలించి బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక నిల్వలపై దాడులు

బూర్గంపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో శనివారం రెవెన్యూ అధికారులు ఇసుక నిల్వలపై దాడులు నిర్వహించారు. తాళ్లగొమ్మూరులో ఆర్ఐ ముత్తయ్య దాడులు చేపట్టి పలు ఇసుక నిల్వలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

25 కిలోల ఎండు గంజాయి పట్టివేత



నిందితులను చూపుతున్న అధికారులు

భద్రాచలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో శనివారం ఖమ్మం ఎక్సైజ్ అధికారులు 25.22 కిలోల ఎండు గంజాయిని స్థానిక బ్రిడ్జి రోడ్డులో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుకున్నారు. గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు ఐదు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజు సీఐ రహీమున్నీసాబేగం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడుల్లో సీఐ రమేష్, హెడ్ కానిస్టేబుళ్లు కరీం, బాలు, సుధీర్, వెంకట్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అశ్వాపురం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమెర్దా కాలనీలో శనివారం ఓవ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈసంఘటనపై అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ములుగు జిల్లా కమలాపురానికి చెందిన గాజర్ల కళ్యాణ్(25), అమెర్దా కాలనీకి చెందిన స్వరూప భార్యాభర్తలు. కళ్యాణ్ హైదరాబాద్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు.

ఈనేపథ్యంలో సమగ్ర సర్వేకోసం కమలాపురం వెళ్లి అక్కడనుంచి భార్యాభర్తలు శుక్రవారం అమెర్దా చేరుకున్నారు. శనివారం కళ్యాణ్ తెలిసిన వారికి సంబంధించిన రేకుల షెడ్ నిర్మించటానికి వెళ్లి తిరిగివస్తుండగా కళ్లు తిరిగి పడగా తలకు తీవ్ర గాయమయ్యింది. దీంతో బంధువులు ఆటోలో చికిత్స నిమిత్తం మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా తమకు మారుడు మృతిపై అనుమానాలున్నాయన్న కళ్యాణ్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

పశువులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

అశ్వారావుపేట రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ జిల్లా తుని నుంచి హైదరాబాదుకు అక్రమంగా తొమ్మిది ఆవులను తరలిస్తున్నారు. రింగ్‌రోడ్ సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమతులు లేకుండా ఆవులను తరలిస్తున్న వాహనం పట్టుబడింది. ఆవులను గోశాలకు తరలించారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

దుమ్ముగూడెం నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగరంలో నిర్వహిస్తున్న సీతారాంపురం ఏకలవ్య మోడల్ పాఠశాల విద్యార్థిని తన ఇంటి వద్ద శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. పెదనల్లబల్లికి చెందిన పదకొండవ తరగతి విద్యార్థిని తన ఇంటి వద్ద గడ్డిమందు తాగింది.

సదరు విద్యార్థిని ప్రవర్తన బాగా లేకపోవడంతో తల్లిదండ్రులను పిలిపించిన పాఠశాల సిబ్బంది వారితో ఇంటికి పంపారు. ఈ క్రమంలో ఆత్మహత్యాయత్నం చేయగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భద్రాచలం ఏరియా ఆసుపత్రి ఇంటెన్సివ్ కేర్ విభాగంలో విద్యార్థిని చికిత్సలు పొందుతోంది. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

చేప పిల్లలలోడు వాహనాన్ని ఢీకొట్టిన కారు



పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

కొణిజర్ల, నవంబరు9(ఆంధ్రజ్యోతి): భీమవరం నుంచి కరీంనగర్, జగిత్యాలకు వెళుతున్న చేప పిల్లలలోడు వాహనాన్ని, ఖమ్మం నుంచి వైరా వైపు వెళ్లుతున్న కారు అతివేగంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. డీసీఎంలోని ట్యాంకులు కిందపడటంతో సగానికి పైగా చేపపిల్లలు రోడ్డుమీద పడి మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన మండల కేంద్రమైన కొణిజర్ల సమీపంలో శుక్రవారం అర్ధ రాత్రి అనంతరం చోటు చేసుకుంది.


భద్రాద్రిలో చెన్నైకు చెందిన భక్తుడి మృతి

భద్రాచలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానం వసతి సముదాయ భవనం మీద నుంచి ఫోన్‌మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కింద పడి చెన్నైకు చెందిన రామకృష్ణ(63) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి మృతిచెందాడు. సీఆర్‌వో కార్యాలయం సమీపంలోని రామసదనంపై అంతస్తు నుంచి రామకృష్ణ కిందపడటంతో తీవ్ర గాయాలతో మరణించినట్లు సమాచారం. మృతదేహాన్ని పట్టణ పోలీసులు పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసు కేసు భయంతో వ్యక్తి ఆత్మహత్య

తల్లాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి చేసినందుకు కేసు నమోదు కావడంతో భయపడి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. తల్లాడ మండలం నర్సింహారావుపేట గ్రామానికి చెందిన ముదిగొండ నర్సింహారావు(50)పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈనెల నాలుగున నర్సింహారావుపేట గ్రామానికి చెందిన సుంకర సత్యనారాయణపై ముదిగొండ నర్సింహారావు దాడి చేశాడు. దాడి గురించి సత్యనారాయణ నర్సింహారావుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విషయం తెలుసుకున్న నర్సింహారావు భయంతో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

గురుకులాల నుంచి డీఎస్సీకి..



- ఉపాధ్యాయులుగా ఎంపికైన రెసిడెన్షియల్ టీచర్లు
- బడులకు వెళుతున్న 120 మంది..
- కేజీబీవీ, గురుకులాల్లో భారీగా ఖాళీలు
- తమకు ప్రాధాన్యం ఇవ్వాలంటున్న పాత కాంట్రాక్టు అభ్యర్థులు

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని పలు కేజీబీవీలు, వివిధ గురుకులాల్లో రెగ్యూలర్, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పని చేస్తున్న పలువురు ఉపాధ్యాయులు ఇటీవల నిర్వహించిన 2024 డీఎస్సీ పరీక్షలో ఎంపికయ్యారు. సుమారు 120 మందికి పైగా ఉపాధ్యాయులు డీఎస్సీ 2024లో అర్హత సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా చేరారు. విద్యార్థులను బావిభారత పౌరులుగా తయారు చేసి గురుతర బాధ్యతలపై ఎక్కువ మంది ఆసక్తి చూపించారు. కేజీబీవీలలో, గురుకులాల్లో గత రెండు మూడేళ్లుగా పని చేస్తూ సర్వీసు సైతం వదులుకొని ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయులుగా చేరారు. దీంతో కేజీబీవీలు, వివిధ సంక్షేమ గురుకులాల్లో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి.

కేజీబీవీ, గురుకులాల నుంచి అత్యధికంగా...

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల ఆధ్వర్యంలో జిల్లాలో పలు విద్యా సంస్థలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. గత ఏడాది వీటిలో రెగ్యూలర్ ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఖమ్మం జిల్లాల్లోని వందల సంఖ్యలో పరీక్ష రాసి ఉత్తీర్ణులైన వారిని ఉపాధ్యాయులుగా నియమించారు. ఇవే సంస్థల్లో పని చేస్తున్న వందల మంది ఉపాధ్యాయులు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షలోనూ తమ సత్తాచాటి ఎంపికయ్యారు. ఇలా ఖమ్మం జిల్లాలో కేజీబీవీల నుంచి 20 మంది, బీసీ గురుకులం నుంచి 30 మంది, ఎస్సీ గురుకులం నుంచి 28 మంది, ఎస్టీ గురుకులం నుంచి 26 మంది, మైనారిటీ గురుకులం నుంచి 18 మంది డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కేజీబీవీలలో ఈ 20 ఖాళీలతోపాటు గతంలో 30 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిసింది. వీటిని భర్తీచేస్తే పలువురు నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేందుకు అవకాశాలున్నాయి.

ఖాళీల భర్తీ ఎలా...

గురుకులాల్లో రెగ్యూలర్ ఉపాధ్యాయుల నియామకంతో కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకున్న పలువురు ఉపాధ్యాయులను తీసివేశారు. ప్రస్తుతం డీఎస్సీతో ఖాళీలు ఏర్పడినందున తిరిగి గతంలో పని చేసిన వారినే విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఏనిర్ణయం తీసుకుంటుందో తెలియని పరిస్థితి. కేజీబీవీలలో, గురుకులాల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని పలువురు విద్యార్థుల తల్లితండ్రులు వాపోతున్నారు. ఖాళీలను వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

బాధ్యతలు అధికం..

గురుకుల విద్యాలయాల్లో పని, వేతనం ఎక్కువే. గురుకులాల్లో టీజీటీ వేతనం ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌తో, పీజీటీ వేతనం జూనియర్ లెక్చరర్ వేతనం అంత ఉంటుంది. రెండు, మూడు ఇంక్రిమెంట్లు సైతం ఉంటాయి. గురుకులాల్లో బోధనతో పాటు బోధనేతర పనులు చేయాల్సి ఉంటుంది. వరుసల వారీగా వారంలో రెండు మూడు రోజులు వార్డెన్ బాధ్యతలు నిర్వహించాలి. వీటికి తోడు పగలు, రాత్రి స్టడీ అవర్స్ సెలవు దినాల్లో విధులు, హౌస్ మాస్టర్, రాత్రి కేర్ టేకర్ బాధ్యతలు నిర్వహించాలి.

మైనారిటీలో ఇద్దరికి డీఎస్సీలో ఉద్యోగం వచ్చినా వారు చేరేందుకు విముఖత చూపినట్లు తెలిసింది.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో

కల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మినీ స్టేడియంలో గత రెండు రోజులుగా రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. అండర్- 17 విభాగంలో (బాలబాలికల) జట్లు లీగ్ పద్ధతిలో తలపడ్డారు. జిల్లా పాఠశాలల క్రీడల సమాఖ్య, జిల్లా విద్యశాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. ఈ క్రీడలతో మినీ స్టేడియం క్రీడాకారులతో కిటకిటలాడింది. నాకౌట్, లీగ్ పద్ధతిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా ఈ క్రీడలను తెలంగాణ రాష్ట్ర, జిల్లా నుంచి పరిశీలకులుగా ఎన్ శివరాం, రంగారెడ్డి, మండల విద్యాశాఖ అధికారి పి నివేదిత, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కె. నర్సింహామూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు పి. వీరరాఘవయ్య, ఎస్‌కే ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం- విజయవాడకు నాలుగు లేన్ల రోడ్డు

- ప్రతిపాదనలకు భట్టి ఆదేశాలు



ప్రతిపాదిత ఖమ్మం-బోనకల్ రహదారి

బోనకల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఖమ్మం-విజయవాడ వరకు నాగులవంచ, బోనకల్ మీదుగా నాలుగు లేన్ల రోడ్డు వేసేందుకు తగు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆర్ అండ్‌బీ ఎస్ఈకు ఆదేశించారు. ఖమ్మం నుంచి బోనకల్ వరకు అక్కడ నుంచి ఆళ్లపాడు, రాయనపేట గ్రామాల మీదుగా వంగవీడు వద్ద ప్రధాన రోడ్డుకు కలుపుతారు. మధిర నుంచి నందిగామకు నాలుగు లైన్ల రోడ్డు వేసి జాతీయ రహదారి పై విజయవాడకు చేరుకుంటారు. గ్రామాల మీదుగా వేసే రోడ్డు కింద పోయే ఆస్తుల నష్టంను అంచనా వేయడంతో, రోడ్డు పనులకు కావాల్సిన నిధులను తగు అంచనాలతో సిద్ధం చేయాలని ఆదేవించారు. నాలుగు లైన్ల రోడ్డు మార్గం పూర్తి చేయడం ద్వార తక్కువ దూరంతో సులువుగా ఖమ్మం నుంచి విజయవాడకు చేరుకోవచ్చు.

పైసలే ప్రామాణికం..

నచ్చిన వారికే ఎంట్రీ



ఒకే కౌంటర్‌లో క్యూలో ఉన్న దరఖాస్తుదారులు

- అంతర్గత పోరులో జిల్లా రవాణాశాఖ
- కార్యాలయంలో తగాదాపడుతున్న ఉద్యోగులు
- బహిరంగ చర్చలకు దారితీస్తున్న రవాణాశాఖ

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వాహనాలు రిజిస్ట్రేషన్ నుంచి రెన్యూవల్స్ వరకు ధ్రువీకరణ పత్రాలే ప్రామాణికంగా ఉంటాయి. రవాణాశాఖలో అవినీతిని నిర్మూలించేందుకు దశల వారీగా అనేక విధానపరమైన నిర్ణయాలను తీసుకున్నారు. కానీ ఖమ్మం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో మాత్రం పైసలే ప్రామాణికంగా చలామణి అవుతున్నాయని బహిరంగంగా విమర్శలు వెలువడుతున్నాయి. కొంతమంది ఉద్యోగులు మితిమీరి మీసేవ సెంటర్ల నిర్వాహకులకు అనుకూలంగా పనులు చేస్తుండటంతో రవాణాశాఖ కార్యాలయంలో అంతర్గత పోరు ఏర్పడింది. దీంతో కార్యాలయంలోనే కొంతమంది ఉద్యోగులు తగాదాలు పడే వరకు వెళ్లిందని విమర్శలు వెలువడుతున్నాయి.

నచ్చిన వారికే ఎంట్రీ

రవాణాశాఖ నిబంధనల మేరకు వాహనాల రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్, ఫిట్‌నెస్ ఇతర పనుల నుంచి డ్రైవింగ్ లైసెన్స్, రెన్యూవల్స్ ఇతర పనులకు దరఖాస్తుదారులు ఆన్‌లైన్ చేయించుకొని నేరుగా రవాణాశాఖ కార్యాలయానికి వెళ్తే వెంటనే పనులు జరగాల్సి ఉంటుంది. పారదర్శకత కోసం 'ఎనీ కౌంటర్.. ఎనీ వర్క్' విధానం రవాణాశాఖలో అమలు చేశారు. కానీ ఖమ్మం ఆర్టీవో కార్యాలయంలో మాత్రం కొన్ని ఫైల్స్ కొన్ని కౌంటర్లు మాత్రమే నిర్వహించాలని, అనుభవం కలిగిన వారికే ప్రాధాన్యం అంటూ గత కొంతకాలంగా శాఖాపరంగా ఉన్న నిబంధనలను పక్కకు పెట్టి ఫైల్స్ పూర్తి చేస్తున్నారు.

ఈ కారణంగా నూతనంగా మీసేవా సెంటర్లు ఆన్‌లైన్ చేసే వారి జోక్యం పెరిగింది. దశబ్దాలుగా మీసేవా సెంటర్లు నిర్వహిస్తున్న వారు, వాహన దస్త్రాలు సరిగా లేవని ఆన్‌లైన్ పనులు జరగని వాటిని కూడా కొంతమంది మీసేవా నిర్వహికులు పూర్తి చేస్తున్నారు. కొంతమంది ఉద్యోగులు అంగీకరించిన వారిని మాత్రమే కార్యాలయం లోపలికి అనుమతి ఇస్తున్నారని అంతర్గతంగా పోరు మొదలైంది. పైసలు ఎక్కువ ఇచ్చిన వారికి కార్యాలయంలోకి అనుమతి ఇస్తున్నారని, అధికారుల వద్ద త్వరగా పనులు జరుగుతున్నాయని ఆరోపణలు వ్యాపించాయి. దీంతో రవాణాశాఖపై అవినీతి ఆరోపణలు బాహాటంగా వ్యాపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం భోజన విరామ సమయంలో జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఈ విషయమై ఉద్యోగుల మధ్య తగాదా ఏర్పడినట్లు తెలిసింది.

విచారణ జరిపిస్తాం
ఎ. వెంకటరమణ, ఇన్‌చార్జ్ డీటీవో



మీసేవ సెంటర్ల నిర్వాహకులు, పైరవీకారులకు డీటీవో కార్యాలయంలోకి రావటానికి అనుమతి లేదు. కార్యాలయంలో ఉద్యోగులు మధ్య జరిగిన విభేదాలు మా దృష్టికి రాలేదు. ఎనీ కౌంటర్.. ఎనీ వర్క్ విధానంలో పనులు చేయాలి. శాఖా పరంగా విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటాం. దరఖాస్తుదారులు నేరుగా రవాణాశాఖ కార్యాలయంలో తమ వాహనాల పనులు పూర్తి చేసుకోవాలి.

శ్రీశైలం పుణ్యక్షేత్రానికి సైకిల్ యాత్ర



శ్రీశైలానికి స్వాముల సైకిల్ యాత్ర

కామేపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండలం తాళ్లగూడెం గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారుడు పిప్పళ్ల శ్రీనివాస్ గురుస్వామి, శ్రీలక్ష్మీ తిరుపతమ్మ మాల ధారుడు అంగడాల వెంకటేశ్వర్లు ఇద్దరు తాళ్లగూడెం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి సైకిల్‌పై యాత్రకు బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున తాళ్లగూడెం అయ్యప్ప మాలధారులు వీరి యాత్రను ప్రారంభించారు. పిప్పళ్ల శ్రీనివాస్ ప్రతి యేడాది మాలధారణలో ఓ పుణ్యక్షేత్రానికి సైకిల్ యాత్ర చేస్తాడు. గత ఏడాది భద్రాచలం వరకు సైకిల్ యాత్ర చేశారు. ఈ ఏడాది శ్రీశైలం సైకిల్ యాత్రను చేపట్టాడు.

పిల్లలు సెల్‌ఫోన్లకు ఆకర్షితులు కావద్దు

- కుటుంబ న్యాయస్థానం కోర్టు న్యాయాధికారి అర్చన కుమారి



ప్రసంగిస్తున్న న్యాయాధికారి

ఖమ్మం లీగల్ నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిల్లలు సెల్‌ఫోన్లకు ఆకర్షితులు కావద్దని, చదువుపై శ్రద్ధ వహించాలని, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కుటుంబ న్యాయస్థానం కోర్టు న్యాయాధికారి ఎం.అర్చన కుమారి అన్నారు. జాతీయ న్యాయసేవల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ సమావేశమందిరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ ఏదైనా సమస్య ఎదురైనప్పుడు దానిని మొదట్లోనే పరిష్కరించుకుంటే ఎటువంటి సమస్యలు రావని అన్నారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అనేకమందికి ఉచితంగా న్యాయవాదులను నియమిస్తూ వారికి న్యాయసహాయం అందించి ఆదుకుంటున్నామని అన్నారు. ఉచిత టోల్ ఫ్రీ నెంబర్‌కి 15100 ద్వారా బాధితులకు న్యాయ సలహాలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి ఎం.కల్పన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, న్యాయవాద సంఘ అధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.

పశువులను వెంటాడుతున్న 'గాలికుంటు'

- పాడి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్న వ్యాధి
- క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయిస్తే మంచి ఫలితం



ఖమ్మం వ్యవసాయం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పశువుల్లో ఉత్పాదక శక్తి తగ్గిపోవడానికి ప్రధాన కారణం గాలికుంటు వ్యాధి అని పశువైద్య శాఖ అధికారులు చెబుతున్నారు. పాడి దిగుబడి తగ్గడమే కాక మరణాలు పెరగడానికి గాలికుంటు వ్యాధి కారణమని.. ఈ వ్యాధితో పశుగణాభివృద్ధి దెబ్బతింటోందని అధికారులు గుర్తించారు. ఖమ్మం జిల్లాలో నల్ల పశువులు(గేదెలు), తెల్ల పశువులు (ఆవులు) సుమారు తొమ్మిది లక్షల వరకు ఉన్నాయి. ఇందులో మూడు నెలల వయస్సు పైబడిన పశువులకు మాత్రమే టీకాలు వేస్తారు. అయితే, టీకా వేయిస్తే పశువుల్లో పాడి దిగుబడి తగ్గిపోతుందనే అపోహలు కొందరిలో ఉన్నాయి. కానీ టీకా వేశాక రెండు రోజులు దిగుబడి తగ్గినట్లు అనిపించినా.. ఆతర్వాత యథాస్థితికి చేరుతుందని పశువైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

వ్యాధి సోకే పశువులు

గాలికుంటు వ్యాధి యుక్త వయసు ఉన్న తెల్ల, నల్ల పశువులకు సోకుతుంది. బలహీనంగా ఉండి, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న పశువుల్లో వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువ. అంతేకాక దేశవాళి పశువుల్లో కంటే సంకర జాతి పశువుల్లో ఎక్కువగా సోకుతుంది.

లక్షణాలు

శరీర ఉష్ణోగ్రత 104-106 డిగ్రీల ఫారన్ హీట్ ఉంటుంది. నోటి ఎపిథీలియం, పళ్ల చిగుళ్లు, నాలుక, ముట్టి లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడి 24 గంటల్లో చితికిపోతాయి. తద్వారా నొప్పితో పశువులు మేత మేయవు. నోటి నుంచి చొంగ కారుతుంది. గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. నొప్పి కారణంగా సరిగ్గా నడవ లేక కుంటుతుంటాయి. పొదుగుపై బొబ్బలు ఏర్పడి, పొదుగు వాపు సంభవిస్తుంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగి దూడలు మరణిస్తాయి. దుక్కిటి పశువులు పనులకు ఉపయోగపడవు. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి అకస్మాత్తుగా తగ్గుతుంది. చూడు పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పశువులు రక్త హీనత కలిగి శ్వాస కష్టంగా పీలుస్తూ, రొప్పుతూ, ఎండ వేడి తట్టుకోలేక నీరసించి పోతాయి. ఈ లక్షణాలన్నీ అధికంగా సంకర జాతి పశువుల్లో ఉంటాయి.

సత్వర చికిత్స చేయిస్తేనే మేలు..

వ్యాధి సోకిన పశువులను వేరు చేసి సత్వర చికిత్స చేయించాలి. పొటాషియం పర్మాంగనేట్ నీళ్లతో పుండ్లను శుభ్రం చేసి, నోటి పుండ్లకు బోరోగ్లీజరిన్‌ను, కాలి పుండ్లకు జింక్ ఆక్సైడ్ లోరాక్సిన్, మిమాక్స్ వంటి ఆయింట్‌మెంట్‌లను పూయాలి. ఈగలు వాలకుండా వేపనూనె, నిమ్లెంట్ వంటి మందుల్ని వాడాలి. మైలతుత్తం ఒకశాతం, తారుల మిశ్రమాన్ని కాలిగిట్టల సందుల్లో నింపవచ్చు. వైరస్‌పై మందులు పని చేయవు. కానీ ఆతర్వాతకలిగే అనర్థాల నివారణకుగాను యాంటీ బయోటిక్స్ 3-5 రోజులు వాడాలి. బొబ్బలతో మేత మేయని పశువులు తగు సంరక్షణ లేక మరణిస్తాయి.

ఈ విషయా న్ని గుర్తించి సులభంగా జీర్ణమయ్యే పోషక పదార్థాలతో కూడిన ఆహారాన్ని అందించాలి. జావ, జొన్న, అన్నం, చిటికెడు ఉప్పు, బెల్లంతో కలిపి ప్రతిరోజు తాగిస్తే ఫలితం ఉంటుంది. మరింత బలహీనంగా ఉంటే గ్లూకోజ్ రక్తంలోకి ఇవ్వాల్సి ఉంటుంది.

నివారణ

పశువుల పుండ్లు, కలుషితమైన మేత, దాణ, నీరు మలమూత్రాదులు వాటి వల్ల వైరస్ వ్యాపిస్తుంది. పశుశాలల్లో వైరస్ క్రిములు ఏడాది వరకు దాగి ఉండి, అనుకూల పరిస్థితుల్లో వ్యాధిని కలిగిస్తాయి. పశువుల శాలలను సోడియం హైడ్రాక్సైడ్, 2 శాతం ఫార్మాలిన్, 4శాతం సోడియం కార్బోనేట్ వంటి మందులతో శుభ్రం చేయాలి. ఆంబోతులు, దున్నల వీర్యం ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన వాటిని సుమారు 3 నెలల వరకు సంపర్కానికి వినియోగించరాదు.

ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పశువులను మూడు వారాలు విడిగా ఉంచి పరిశీలించి మాత్రమే ఆరోగ్యమైన పశువుల్లో కలపాలి. వ్యాధిగ్రస్తమైన పశువుల కళేబరాలను లోతైన గొయ్యి తీసి అందులో సున్నం వేసి పాతి పెట్టాలి. లేదా కాల్చి వేయాలి.

ఇతర పశువులకు వ్యాధి సోకకుండా వ్యాధిగ్రస్తమైన పశువులను దూరంగా ఉంచాలి. వ్యాధి నుంచి కోలుకున్న పశువుల్లో రొప్పడంతో పాటు గర్భ స్రావాలు, పొదుగు వాపు, వంధత్వం, న్యూమోనియా, రక్తక్షీణత, గిట్టలే పోవటం వంటి దుష్ఫలితాలు ఉంటాయి



గ్రామాల్లో కులగణన ప్రారంభం



కామేపల్లి,నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 24గ్రామ పంచాయతీల్లో కులగణన ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. తొలిరోజు కావడంతో గందరగోళం ఏర్పడింది. ప్రశ్నల వర్షం కురిపించడంతో ప్రజలు అయోమయంలో పడ్డారు. ఎంచెప్పాలో తెలియక తెల్లమెహం వేశారు. తహశీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి, ఈసీ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	36రూ.
వంకాయ	50
గుత్తి వంకాయ	56
బీరకాయ	40
పచ్చిమిర్చి	48
కాకరకాయ	30
బెండకాయ	48
పొట్లకాయ	40
దోసకాయ	28-38
గోరుచిక్కుడు	48
నాటుచిక్కుడు	120
క్యాబేజీ	38
దొండ	28-38
సొరకాయ	28
క్యారెట్	78
క్యాప్సికం	78
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	175
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్





తిరుమలాయపాలెం మండలం రావిచెట్టుతండా వద్ద కూలిపోయిన బ్రిడ్జి(ఫైల్)

వారధి నిర్మాణం ఎన్నడో?

- తిరుమలాయపాలెంలో వరదలకు కొట్టుకు పోయిన వంతెనలు
- నేటికీ పనులు ప్రారంభం కాని వైనం
- అంతర్‌జిల్లా ప్రయాణం ఇబ్బందికరం

తిరుమలాయపాలెం,నవంబరు9(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరులో వచ్చిన భారీ వరదలకు మండలంలో పలు గ్రామాల్లో రహదారులు, బ్రిడ్జిలు కూలిపోయాయి.. వీటి నిర్మాణానికి, పూర్తిస్థాయి మరమ్మతులకు అధికారులు నేటికీ చర్యలు తీసుకోలేదు. మండలంలో భారీవర్షాలతో పాటు ఎగువనుంచి వరద రావడంతో ఆకేరు పొంగింది. దీంతో వంతెనలు, రహదారులు మొత్తం కొట్టుకు పోయాయి. పొలాల్లో ఇసుకమేటలు వేశాయి. హైదర్‌సాయిపేట సమీపంలోని రావిచెట్టుతండా వద్ద ఆకేరు నదిపై రూ.16కోట్లతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకేరుపై బ్రిడ్జి నిర్మించారు. దీంతో ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా సరిహద్దు గ్రామాలకు రవాణ సౌకర్యం సులభతరమైంది. ఇటీవల కురిసిన భారీవర్షంతో బ్రిడ్జి మొత్తం కొట్టుకుపోయింది. దీంతో రహదారి సౌకర్యం నిలిచిపోయింది. మండలంలోని పాతర్లపాడు జల్లేపల్లి, హైదరసాయిపేట, పిండిప్రోలు, చంద్రుతండా, కేశవాపురం, జోగులపాడు ప్రజలు మహబూబాద్ వెళ్లెందుకు 15కిమీ దూరం ఉంది. బ్రిడ్జి తెగడంతో మరిపెడ మీద నుంచి 30కి.మీ అదనంగా ప్రయాణించి మహబూబాబాద్‌కు వెళుతున్నారు. అలాగే అజ్మీరతండా, రాకాసితండా మధ్యలో ఆకేరుపై నిర్మించిన బ్రిడ్జి అప్రోచ్ బీటీ రోడ్డు తెగిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తిరుమలాయపాలెం-ములకలపల్లి మధ్యలో ఆకేరుపై నిర్మించిన బ్రిడ్జిఅప్రోచ్ రోడ్డుకూడా దెబ్బతిన్నది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు, వాహనదారులు ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కొక్కిరేణి, ఎర్రగడ్డ, బచ్చోడు, సుబ్లేడు, హస్నాబాద్ సమీపంలో బీరోలు కాకరవాయి రహదారిలో బంధంపల్లి వద్ద రోడ్డు తెగిపోయింది. మేడిదపల్లి-సుబ్లేడులో మధ్య రోడ్డు కూడా దెబ్బతిన్నది. దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేశారు కానీ పూర్తిస్థాయిలో పనులు చేయకపోవడంతో గుంతలు మయంగా మారింది. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా రావిచెట్టుతండా వద్ద బ్రిడ్జి కొట్టుకుపోవడంతో అంతర్ జిల్లాల రవాణ సౌకర్యం తెగిపోయింది. అధికారులు స్పందించి కొట్టుకుపోయిన బ్రిడ్జి నిర్మించాలని, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.2లక్షల రుణమాఫీ ఇవ్వాలి

తిరుమలాయపాలెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ ఎటువంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని టీడీపీ పాలరు ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తిరుమలాయపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అనేక వాగ్దానాలు చేసిందన్నారు. గద్దెనెక్కాక వాటిని విస్మరించిందన్నారు రుణమాఫీ కొందరికే వర్తించిందని అర్హులైన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు ఈ సమావేశంలో కొప్పుల వెంకటరావు, మల్లీడి నాగన్న, మల్లీడి రమేష్, భాగ్యమమ, కొలిశెట్టి భిక్షం పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు కొత్త భవనాలు నిర్మించండి

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ హాస్టల్స్, గురుకులాలకు కొత్తభవనాలు నిర్మించాలని జాతీయ బీసీసంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బుర్రా వెంకటేశాన్ని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, భూపేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	అపుడో ఇప్పుడో ఎపుడో
ఆదిత్య:	క
తిరుమల:	దేవర
సినీ గెలాక్సీ:	ధూంధాం

కొత్త ఓటర్లను నమోదు చేయండి

» రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న రాజేశ్వరి

నేలకొండపల్లి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతీ ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి బీఎల్ఓలను ఆదేశించారు. శనివారం ఆమె సింగారెడ్డిపాలెం, నేలకొండపల్లి, పైనంపల్లి పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. కొత్త ఓటర్లను నమోదు చేయటంతో పాటుగా మార్పులు, చేర్పులు చేయాలన్నారు. కొత్త ఓట్ల నమోదుపై రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫాం 6, 7, 8 తీసుకునేటప్పుడు సరిచూసుకోవాలన్నారు. తహసీల్దార్ జాదవ్ మాణిక్యం, ఎమ్మార్‌ఐలు ఆలస్యం మధుసూధనరావు, రవి, బీఎల్వోలు అన్నపూర్ణ, రమాదేవి తదితరులు ఆర్వో వెంట ఉన్నారు.

పార్టీ దిమ్మెను కూల్చటం అన్యాయం

» మహాజన సోషలిస్టు నాయకుడు ఆనందరావు



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నేలకొండపల్లి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో మహాజన సోషలిస్టు పార్టీ దిమ్మెను అధికారులు కూల్చటం అన్యాయమని పార్టీ పాలేరు ఇన్‌ఛార్జి వంగూరి ఆనందరావు అన్నారు. శనివారం చెన్నారంలో కూలగొట్టిన జెండా దిమ్మె స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో ఎటువంటి అడ్డం లేకుండా ఉన్న దిమ్మెను కూల్చటం అన్యాయమన్నారు. ఎన్నో రాజకీయ పార్టీల దిమ్మెలు ఉన్నప్పటికీ, మహాజన సోషలిస్టు పార్టీ దిమ్మెను కూల్చటం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే దిమ్మెను పునఃనిర్మించాలని ఆనందరావు డిమాండ్ చేశారు. నాయకులు పగిడికత్తుల ఈదయ్య, పొట్టపింజర బాలస్వామి, వడ్లమూడి హనుమంతరావు, వీరస్వామి, ప్రకాష్ పరిశీలించినవారిలో ఉన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ పోస్ట్ ఖాళీ

నాలుగు నెలలుగా అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల ఇబ్బందులు



ఖమ్మంటౌన్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. నగరంలోని సుమారు 5లక్షల మందికి సేవలు అందిస్తున్న ఈ కార్యాలయంలో ఈ కారణంగా పనుల్లో జాప్యం జరుగుతోందనే విమర్శలు ఉన్నాయి. కార్యాలయంలో కీలకమైన డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) పోస్టు సుమారు నాలుగు నెలలుగా ఖాళీగా ఉంటోంది. ఫలితంగా కార్యాలయానికి వచ్చేవారికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. కార్యాలయ నిర్వహణ బాధ్యత డీటీదే.. తహసీల్దార్ అందుబాటులో లేనప్పుడు డిప్యూటీ తహసీల్దార్ కార్యాలయం బాధ్యత తీసుకుంటారు. ఎంతో కీలకమైన ఈ డీటీ పోస్టు ఖాళీగా ఉన్నా ఉన్నతాధికారులు పట్టించుకోవటం లేదు.

వెంటవెంటనే బదిలీలు

అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్లకు వెంటవెంటనే బదిలీలు జరుగుతున్నాయి. తొలుత ఉన్న డీటీకి ఉద్యోగోన్నతి రావటంతో, రఘునాథపాలెం డీటీని ఖమ్మం అర్బన్ కార్యాలయానికి బదిలీ చేశారు. అతడికి బదిలీ కావటంతో వైరా డీటీని ఇక్కడ నియమించారు. అనంతరం ఆయనకు బదిలీ అయినా, ఆ స్థానంలో నాలుగునెలలుగా ఎవరినీ నియమించలేదు.

డీటీ పోస్టు ఎంతో కీలకం

తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)పోస్టు ఎంతో కీలకం. కార్యాలయ నిర్వహణ (అడ్మినిస్ట్రేషన్) బాధ్యత డీటీదే. భూములకు సంబంధించిన అంశాలతో పాటు కొన్ని ధృవపత్రాల జారీని డిప్యూటీ తహసీల్దార్ నిర్వహిస్తారు. ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు డీటీయే ఇస్తారు. ఇక ధరణి నుంచి సర్వేవరకు, అలాగే పహణీ నకళ్లు కావాలన్నా, ఇలా ఎటువంటి పనులైనా డీటీ ఆమోదిస్తేనే తరువాత తహసీల్దార్ వద్దకు వెళతాయి. అంతే కాకుండా కార్యాలయం పరిధిలోని సివిల్‌సప్లయ్ విభాగంపై అజమాయిషీ డిప్యూటీ తహసీల్దారుదే.. ఉద్యోగుల పనితీరును పరిశీలించవలసిన బాధ్యత కూడా డిప్యూటీ తహసీల్దార్‌దే. ఇలా పలు కీలకమైన అదికారాలు డిప్యూటీ తహసీల్దార్‌కు ఉండగా, పెద్ద పరిధిగల అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డీటీ పోస్టు ఖాళీగా ఉన్నా పట్టించుకోవటం లేదు.

డిప్యూటీ తహసీల్దార్ లేకపోవటంతో...

ప్రస్తుతం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డీటీ పోస్ట్ ఖాళీగా ఉండటంతో తహసీల్దార్‌పై భారం పడుతున్నది. జిల్లా కేంద్రం కావటంతో మంత్రుల, ప్రముఖుల పర్యటనలో తహసీల్దార్ ఖచ్చితంగా పాల్గొనాల్సి ఉంటుంది. ఖమ్మం అర్బన్ పరిధిలో భూములకు సంబంధించిన కోర్టుకేసులు కూడా ఎక్కువగా ఉండటంతో వాటికి హాజరు కావాల్సిఉంటుంది. డిప్యూటీ తహసీల్దార్ లేకపోవటంతో పలు ధృవపత్రాల పరిశీలన కూడా తహసీల్దార్ చూసుకోవాల్సి వస్తున్నది. తహసీల్దార్ అందుబాటులో లేకుంటే పనుల్లో తీవ్రమైన జాప్యం జరుగుతోంది. సౌరసేవలను దృష్టిలో ఉంచుకొని డిప్యూటీ తహసీల్దార్ పోస్టును భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హలో ఆర్టీసీ

ఖమ్మం కొత్త బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225979
కార్గోసేవల నెంబరు:	9154298589

ఖమ్మం పాతబస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225965
కార్గోసేవల నెంబరు:	9704345599

సత్తుపల్లి బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225962
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225990
కార్గోసేవల నెంబరు:	9154298595

మధిర బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225961
బస్టాండ్ ఎంక్వయిరీ:	7382925289
కార్గోసేవల నెంబరు:	8143765370

పేరు ఎలా వచ్చిందంటే ? పొట్టి శ్రీరాములు రోడ్



ఖమ్మంసాంస్కృతికం, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని త్రీటౌన్ ప్రాంత వీధుల్లో పీఎస్ఆర్‌రోడ్ పేరు అందరికీ తెలిసిందే.. వర్తక వ్యాపార కూడలి కావటంతో ఖమ్మం వాసులకే కాక జిల్లావ్యాప్తంగా పరిసర మండలాల ప్రజలకూ పరిచితమే. పీఎస్ఆర్ రోడ్ అని సంక్షిపంగా కూడా ఈరోడ్‌కు పేరుంది.. గుంటుమల్లేశ్వరస్వామి దేవాలయం ముందునుంచి వ్యవసాయ మార్కెట్ వైపు వెళ్లే రోడ్‌ను పీఎస్ ఆర్ రోడ్‌గా పిలుస్తారు. ఉమ్మడి ఆంధ్రరాష్ట్ర అవతరణకు కారకుడైన పొట్టి శ్రీరాములు జ్ఞాపకంగా ఈ రోడ్‌కు ఈపేరు పెట్టారు. ఇక్కడ హోల్‌సేల్, రిటైల్ వర్తక, వ్యాపారాలుండటంతో అధికులు వైశ్యవర్గానికి చెందిన వారే కనుక పొట్టి శ్రీరాములు రోడ్ పేరు నిర్ణయించటానికి కారణం.. 1997లో ఇక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేసినా ఆతరువాత దానికి జాలీని అమర్చి స్మారక మందిరంగా మార్చారు. గతంలో మాదిరిగా పొట్టి శ్రీరాములు సంస్మరణ కార్యక్రమాలు అంతగా జరగటం లేదు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్

వైరా, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె.సురేంద్ర మోహన్ సూచించారు. వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సురేంద్రమోహన్ శనివారం సందర్శించి పరిశీలించారు. మార్కెట్‌యార్డులో ఉన్న ధాన్యం రాశులు, రైతులు ఆరబోసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా మార్కెట్‌శాఖ అధికారి అలీం, డీసీఎంఎస్ మేనేజర్ సందీప్, సివిల్ సప్లయి డీటీ రామచంద్రరావు, ఆర్ఐ కిరణ్, వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో మయాన్ మంజూఖాన్ ఉన్నారు.

మధిరరూరల్: మధిర మండలం మాటూరు మంజిత్ కాటన్‌మిల్లు వద్దగల సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఖమ్మంజిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన రైతులు తమ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి అలీం, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం సిరిపురం గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన పర్యవేక్షించారు. పలు సూచనలు చేశారు.

మధిరటౌన్: రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించాలని సురేంద్ర మోహన్ ఆదేశించారు. మండలంలో ఇసుక కొరత లేకుం డా చూడాలని ఖమ్మంలో ఏర్పాటు చేసినట్లు ఇసుక స్టాక్ యార్డు మధిరలో కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.



శ్రీరామ మందిరంలో దీపోత్సవం

నేలకొండపల్లి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి సింగారెడ్డిపాలెం శ్రీరామ మందిరంలో దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం శుక్రవారం రాత్రి మహిళలు తొలుత పూజలు నిర్వహించారు. అనంతరం దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాలడుగు పూర్ణచంద్రప్రసాద్, అక్కినేని నాగేశ్వరరావు, అక్కినేని లక్ష్మి, పాలడుగు జయలలిత,చవళం భువన, మలసాని సుమతి అర్చకుడు ముడుంబై రామానుజాచార్యులు పాల్గొన్నారు.

వెండి తమలపాకుల బహూకరణ

మధిర, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మధిర దివ్య షిర్డీ సాయి బాబా దేవాలయంలోని శ్రీప్రసన్నాంజనేయస్వామికి భక్తులు లక్షన్నర రూపాయల విలువచేసే వెండి తమలపాకులను శనివారం బహూకరించారు. పసూర గ్రూప్స్ చైర్మన్ పబ్బతి రవికుమార్, ఆలయ కోశాధికారి కురువెళ్ల కృష్ణ ఆధ్వర్యంలో భక్తుల ఆర్థిక సహకారంతో కేజీన్నర బరుతో తయారుచేసిన వెండి తమలపాకుల మాలను శ్రీఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు అలంకరించారు.

గెస్ట్ ఫ్యాకల్టీతోనే సరి..

» 15 మంది లెక్చరర్లకు గాను 9 మంది గెస్ట్ ఫ్యాకల్టీ » గెస్ట్ ఫ్యాకల్టీతోనే ఫలితాలు సాధిస్తున్న మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల



మధిర, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మధిరలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్ ఫ్యాకల్టీతోనే మంచిఫలితాలు సాధిస్తుంది. నియోజకవర్గంలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాల్లో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇదే. నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఈ కళాశాలను మంజూరు చేశారు. నాలుగు దశాబ్దాలుగా తొలుత ఉస్మానియా అనుబంధంగా, తర్వాత కాకతీయ యూనివర్శిటీ అనుబంధంగా కొనసాగుతుంది. ఎంతోకాలంగా విద్యార్థులు కోరుతున్న డిమాండ్‌పై కళాశాలలో ఈ యేడాది సైన్సుగ్రూపులు ప్రారంభమయ్యాయి. కాని ఫ్యాకల్టీని మాత్రం ప్రభుత్వం నియమించలేదు. ఆర్ట్స్ గ్రూపుల్లో కూడా సరిపడా రెగ్యులర్ ఫ్యాకల్టీ లేరు. అంతా గెస్ట్ ఫ్యాకల్టీనే పనిచేస్తున్నారు. గతంకంటే అడ్మిషన్లు కొంత మెరగయ్యాయి. అలాగే ఈయేడాది బీఏలో 86.6శాతం, బీకాంలో 73శాతం ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం ఇప్పటివరకు డిగ్రీ మొదటి సంవత్సరంలో 110మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. ఇంటర్ విద్యార్థులంతా ఇంజనీరింగ్ కోర్సులపట్ల మొగ్గుచూపుతున్న దశలో ప్రభుత్వ కళాశాలలో ఈమాత్రం అడ్మిషన్లు రావడం వెనుక లెక్చరర్ల పాత్ర ప్రముఖంగా ఉంది.

ల్యాబ్ సౌకర్యం లేక ఇబ్బందులు

కళాశాలలో మొత్తం 15మంది లెక్చరర్లు పనిచేస్తున్నారు. అందులో నలుగురు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు కాగా, మిగిలినవారంతా గెస్ట్ ఫ్యాకల్టీవారే పనిచేస్తున్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్‌లో నలుగురు రెగ్యులర్ వారుండగా, అవుట్ సోర్సింగ్ లో నలుగురు పనిచేస్తున్నారు. ఈ ఏడాది మధిరలో బీఎస్సీలో రెండు సైన్సు సెక్షన్లు ప్రారంభమయ్యాయి. అయితే ప్రభుత్వం ఇంతవరకు ఫ్యాకల్టీని మాత్రం నియమించలేదు. గెస్ట్ ఫ్యాకల్టీని నియమించుకొని వారితోనే సైన్సు విద్యార్థులకు విద్యాబోధన కొనసాగుతుంది. కళాశాలలో సైన్సు విద్యార్థులకు అత్యంతముఖ్యమైన ల్యాబ్ సౌకర్యం కూడా లేదు.

బాలికల హాస్టల్ నిర్మించాలని వినతి

కాలేజీ బాలికల హాస్టల్ మంజూరు చేయాలని విద్యార్థినిలు కోరుతున్నారు. నియోజకవర్గంలో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇదే. హాస్టల్ సదుపాయం లేకపోవడంతో విద్యార్థినిలు ఎక్కువగా చేరలేకపోతున్నారు. మధిరలో కాలేజీ హాస్టల్ బాలికల కోసం మంజూరు చేయాలని కోరుతున్నారు.

పీజీకోర్సులు, బీఈడీకి డిమాండ్

మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులు, బీఈడీ మం జూరు చేయాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక్క ప్రభుత్వ కళాశాలలో పీజీ కోర్సులు లేక, ప్రైవేట్‌లో చదివే స్తోమతలేక చాలామంది పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారు. గతంలో మధిరలో రెండు బీఈడీ కాలేజీలు, ఒక ఇంజనీరింగ్ కళాశాల, నాలుగు డిగ్రీ కళాశాలలు ప్రైవేట్‌లో నడిచాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రైవేట్ కాలేజీలు అన్ని మూతపడ్డాయి. ఈపరిస్థితులలో మధిరలో డిగ్రీ కళాశాలలో బీఈడీ, పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీరింగ్ కళాశాలలు ప్ర భుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలనే డి మాండ్ చేస్తున్నారు. అలాగే డిప్యూటీ సీఎం మధిరను విద్యాహబ్‌గా మారుస్తామని హామీఇచ్చినందున మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పీజీ, బీఈడీ కోర్సులు మంజూరు చేయాలని, అవసరమైన ఫ్యాకల్టీని నియమించాలని కోరుతున్నారు.

నూతన భవన నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలి

కళాశాల ప్రస్తుతం తరగతి గదుల్లోనే కొనసాగుతుంది. ఆఫీస్ స్టాఫ్ కూడా ఆ గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. కళాశాలకు నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఉంది. అలాగే కళాశాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయాల్సి ఉంది. కొత్తగా భవనం కావాలని కోరడంతో డిప్యూటీ సీఎం నూతన భవనం నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఇందుకు రూ.2కోట్లు నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత అధికారులు త్వరితగతిన నిర్మాణం పూర్తిచేయాలని కళాశాల ఉద్యోగులు, విద్యార్థులు కోరుతున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తుపల్లి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): జేవీఆర్ ప్రభుత్వ కళాశాల కేంద్రంగా నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విద్యాలయ డిగ్రీ ప్రవేశాలకు ఈనెల 15వ తేదీ తుది గడువు అని సత్తుపల్లి ప్రాంతీయ అధ్యయన కేంద్ర సమన్వయకర్త డా.చీపు పూర్ణచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఒకేషనల్ కోర్సులలో ఉత్తీర్ణత సాధించిన వారు డిగ్రీలో చేరేందుకు అర్హులన్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సర ట్యూషన్ ఫీజు చెల్లించడానికి కూడా ఈనెల 15వ తేదీ ఆఖరని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 94918 81910 73829 29742 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ సంధ్య



భక్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ సంధ్య

మధిర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళా భక్తులు కార్తీక మాసం పురస్కరించుకొని దేవాలయాలకు తెల్లవారుజామునే ఒంటరిగా బంగారం అలంకరించుకొని వెళ్లేటప్పుడు అప్రమత్తతతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టౌన్ ఎస్ఐ సంధ్య సూచించారు. శుక్రవారం రాత్రి మధిరలోని శ్రీమృత్యుంజయస్వామి ఆలయంలో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళా భక్తులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గొలుసు దొంగతనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వంటరిగా వెళ్లేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇటీవల తరుచుగా పలు ప్రాంతాల్లో జరుగుతున్న గొలుసు దొంగతనాలను తెలియజేసి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే రాయపట్నంలోనూ మహిళలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమాల్లో టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీతోనే సరి..

» 15 మంది లెక్చరర్లకు గాను 9 మంది గెస్ట్ ఫ్యాకల్టీ » గెస్ట్ ఫ్యాకెల్టీతోనే ఫలితాలు సాధిస్తున్న మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల



మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం

మధిర, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మధిరలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్ ఫ్యాకల్టీతోనే మంచిఫలితాలు సాధిస్తుంది. నియోజకవర్గంలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాల్లో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇదే. నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఈ కళాశాలను మంజూరు చేశారు. నాలుగు దశాబ్దాలుగా తొలుత ఉస్మానియా అనుబంధంగా, తర్వాత కాకతీయ యూనివర్శిటీ అనుబంధంగా కొనసాగుతుంది. ఎంతోకాలంగా విద్యార్థులు కోరుతున్న డిమాండ్‌పై కళాశాలలో ఈ యేడాది సైన్సుగ్రూపులు ప్రారంభమయ్యాయి. కాని ఫ్యాకల్టీని మాత్రం ప్రభుత్వం నియమించలేదు. ఆర్ట్స్ గ్రూపుల్లో కూడా సరిపడా రెగ్యులర్ ఫ్యాకల్టీ లేరు. అంతా గెస్ట్ ఫ్యాకల్టీనే పనిచేస్తున్నారు. గతంకంటే అడ్మిషన్లు కొంత మెరుగయ్యాయి. అలాగే ఈయేడాది బీఏలో 86.6శాతం, బీకాంలో 73శాతం ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం ఇప్పటివరకు డిగ్రీ మొదటి సంవత్సరంలో 110మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. ఇంటర్ విద్యార్థులంతా ఇంజనీరింగ్ కోర్సుల పట్ల మొగ్గుచూపుతున్న దశలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈమాత్రం అడ్మిషన్లు రావడం వెనుక కళాశాల లెక్చరర్ల పాత్ర ప్రముఖంగా ఉంది.

ల్యాబ్ సౌకర్యం లేక ఇబ్బందులు

కళాశాలలో మొత్తం 15మంది లెక్చరర్లు పని చేస్తున్నారు. అందులో నలుగురు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు కాగా, మిగిలినవారంతా గెస్ట్ ఫ్యాకల్టీవారే పనిచేస్తున్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్‌లో నలుగురు రెగ్యులర్ వారుండగా, అవుట్ సోర్సింగ్ లో నలుగురు పనిచేస్తున్నారు. ఈ ఏడాది మధిరలో బీఎస్సీలో రెండు సైన్సు సెక్షన్లు ప్రారంభమయ్యాయి. అయితే ప్రభుత్వం ఇంతవరకు ఫ్యాకల్టీని మాత్రం నియమించలేదు. గెస్ట్ ఫ్యాకల్టీని నియమించుకొని వారితోనే సైన్సు విద్యార్థులకు విద్యాబోధన కొనసాగుతుంది. కళాశాలలో సైన్సు విద్యార్థులకు అత్యంతముఖ్యమైన ల్యాబ్ సౌకర్యం కూడా లేదు.

బాలికల హాస్టల్ నిర్మించాలని వినతి

కాలేజీ బాలికల హాస్టల్ మంజూరు చేయాలని విద్యార్థినిలు కోరుతున్నారు. నియోజకవర్గంలో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇదే. హాస్టల్ సదుపాయం లేకపోవడంతో విద్యార్థినిలు ఎక్కువగా చేరలేకపోతున్నారు. ఎంతోకాలంగా మధిరలో కాలేజీ హాస్టల్ బాలికల కోసం మంజూరుచేయాలని కోరుతున్నారు.

పీజీకోర్సులు, బీఈడీ మంజూరు కోసం డిమాండ్


మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులు, బీఈడీ మం జూరు చేయాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక్క ప్రభుత్వ కళాశాలలో పీజీ కోర్సులు లేక, ప్రైవేట్‌లో చదివే స్తోమతలేక చాలామంది పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారు. గతంలో మధిరలో రెండు బీఈడీ కాలేజీలు, ఒక ఇంజనీరింగ్ కళాశాల, నాలుగు డిగ్రీ కళాశాలలు ప్రైవేట్‌లో నడిచాయి. తెలంగాణ ఏ ర్పడిన తర్వాత ప్రైవేట్ కాలేజీలు అన్ని మూతపడ్డాయి. ఈపరిస్థితులలో మధిరలో డిగ్రీ కళాశాలలో బీఈడీ, పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీరింగ్ కళాశాలలు ప్ర భుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలనే డి మాండ్ చేస్తున్నారు. అలాగే డిప్యూటీ సీఎం మధిర ను విద్యాహబ్‌గా మారుస్తామని హామీఇచ్చినందున మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పీజీ, బీఈడీ కోర్సులు మంజూరు చేయాలని, అవసరమైన ఫ్యాకల్టీని నియమించాలని కోరుతున్నారు.

నూతన భవన నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలి

కళాశాల ప్రస్తుతం తరగతి గదుల్లోనే కొనసాగుతుంది. ఆఫీస్ స్టాఫ్ కూడా ఆ గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. కళాశాలకు నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఉంది. అలాగే కళాశాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయాల్సి ఉంది. కొత్తగా భవనం కావాలని కోరడంతో డిప్యూటీ సీఎం నూతన భవనం నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఇందుకు రూ.2కోట్లు నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత అధికారులు త్వరితగతిన నిర్మాణం పూర్తిచేయాలని కళాశాల ఉద్యోగులు, విద్యార్థులు కోరుతున్నారు.

నీలాద్రీశ్వరుడిని దర్శించుకున్న మంత్రి పొంగులేటి

పెనుబల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన నీలాద్రీశ్వర స్వామి వారిని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పొంగులేటికి ఆలయ ఈవో పాకాల వెంకటరమణ, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన నీలాద్రీశ్వరునికి రాష్ట్ర ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్‌తో కలిసి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పొంగులేటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దేవస్థానం కమిటీ చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

'కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి'

తల్లాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని కల్లూరు ఆర్డీవో రాజేందర్‌గౌడ్ ఆదేశించారు. శనివారం మండలంలోని మల్లవరం, తల్లాడ గ్రామా ల్లో కులగణన సర్వేను ఆయన పరిశీలించారు. మండలంలోని 27గ్రామ పంచాయతీల్లో 113 మంది ఎన్యూమరేటర్లతో కులగణన సర్వే ప్రారంభమైంది. కార్యక్రమంలో తహసీల్దార్ ఏ.వనజా, ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి, ఏపీవో కోటయ్య, ఎంఆర్ఐ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు ఎస్.కృష్ణారావు, షేక్.సిద్దిక్‌మియా పాల్గొన్నారు.

ముదిగొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వర్తించాలని ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు ఎన్యూమరేటర్లను ఆదేశించారు. శనివారం ముదిగొండలో కులగణన సర్వేను పరిశీలించి ఎన్యూమరేటర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబసభ్యులు ఇచ్చిన వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. సర్వే తీరును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఆర్ఐలు వహీదా, ప్రసన్నకుమార్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ నాగూల్‌మీరా పాల్గొన్నారు.



కారేపల్లిలోసర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేందర్

కారెపల్లి నవంబరు9(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి సర్వేను మండల ఎంపీడీవో సురేందర్ శనివారం పరిశీలించారు. మండల పరిధిలోని చిన్నమడెంపల్లి, చర్లపల్లి, మాణిక్యారం గ్రామాలలో జరుగుతున్న సర్వే పనులనుఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సురేందర్ మాట్లాడుతూ సర్వేను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

వైరా, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రారంభించారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌ల్లో సర్వే చేపట్టారు. శనివారం సెలవు దినం కావడంతో ఉపాధ్యాయులు ఉదయం నుంచే సర్వేకు శ్రీకారం చుట్టారు. వైరాలో జరిగిన సర్వేను తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, గ్రామాల్లో ఎంపీడీవో సరస్వతీ, ఎంపీవో జ్యోత్స్నదేవి పరిశీలించారు.



మల్లవరంలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేందర్‌గౌడ్

మధిరటౌన్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ, ఆర్థిక, రాజకీయ, కులగణన సర్వేలో సిబ్బంది ఎటువంటి పత్రాలు అడగరని సీపీవో శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలో జరుగుతున్న సర్వేని పరిశీలించిన అనంతరం మధిర తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో తహసీ ల్దార్ రాంబాబు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తొలి రోజు మధిర పట్టణం లో వెయ్యి కుటుంబాలను సర్వే చేసినట్లు మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తెలిపారు.

కల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేను శనివారం డివిజన్‌లోని తల్లాడ, కల్లూరు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆర్డీవో రాజేంద్రగౌడ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు, తల్లాడ మండలాల తహసీల్దార్లు పి. సాంబశివుడు, వనజ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

» ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె.సురేంద్రమోహన్



వైరా ఏఎంసీలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్

వైరా, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె.సురేంద్రమోహన్ సూచించారు. వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సురేంద్రమోహన్ శనివారం సందర్శించి పరిశీలించారు. మార్కెట్‌యార్డులో ఉన్న ధాన్యం రాశులు, రైతులు ఆరబోసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, జిల్లా మార్కెట్ శాఖ అధికారి అలీం, డీసీఎంఎస్ మేనేజర్ సందీప్, సివిల్‌సప్లయి డీటీ రామచంద్రరావు, ఆర్ఐ కిరణ్, వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో మయాన్ మంజూఖాన్ ఉన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం పరిశీలన

మధిర రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మాటూరు మంజిత్ కాటన్ మిల్లు వద్దగల సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఖమ్మంజిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్రమోహన్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి అలీం, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మధిరటౌన్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్ ఆదేశించారు. మండలంలో ఇసుక కొరత లేకుండా చూడాలని ఖమ్మంలో ఏర్పాటు చేసినట్లు ఇసుక స్టాక్ యార్డు మధిర లో కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీవో శ్రీనివాస్, మైనింగ్ అధికారి ఖాజామొయినుద్దీన్, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తదితరులున్నారు.

నేడు మధిరలో ఆర్యవైశ్యుల వనసమారాధన

మధిర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం మధిర పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 10వతేదీ ఆదివారం మధిర మండలం ఆత్కూరు అబ్బూరి మామిడితోటలో ఆర్యవైశ్య సామూహిక వనసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు వనమా కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధిర పట్టణం, మండలంలోని ఆర్యవైశ్యులంతా కుటుంబ సమేతంగా ఈకార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

విద్యార్థికి జీయర్ స్వామి మంగళశాసనములు

సత్తుపల్లిరూరల్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనారాయణ జూనియర్ కళాశాల విద్యార్థి ఎన్‌సీహెచ్.శ్రీసఖ వరుణ్ ఈ ఏడాది జూన్‌లో ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో ఎంపీసీ విభాగంలో 468/470 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని ముచ్చింతల్ దివ్య సాకేత ప్రాంగణంలో త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజజీయర్ స్వామి విద్యార్థి వరుణ్‌ను అభినందిస్తూ వచ్చేఏడాది కూడా మంచి ఫలితాలు సాధించాలని మంగళాశాసనములు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎన్‌సీహెచ్.రామకృష్ణమాచార్య, కరస్పాండెంట్ వనమారెడ్డి మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజాకృష్ణ పాల్గొన్నారు.

రేపు ముత్యాలమ్మ ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం

తల్లాడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామంలో వేంచేసియున్న ముత్యాలమ్మ తల్లి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించడం జరుగుతుందని అర్చకుడు కంచల సతీష్‌శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష గాజులతో ముత్యాలమ్మ అ మ్మవారికి విశేషాలంకరణ, రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాస్టర్స్ ఫెలోషిప్ మండల కమిటీ ఎన్నిక

ముదిగొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆత్మీయ ప్రార్థనా సహవాసం పాస్టర్స్ ఫెలోషిప్ మండల నూతన కమిటీని శనివారం ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా మోషే చారి, వైస్‌ప్రెసిడెంట్‌గా జీవన్‌కుమార్, కార్యదర్శిగా లూకా రాజు, జాయింట్ సెక్రటరీగా యోహాన్, కోశాధికారిగా కిరణ్, బాలస్వామి, అగస్టీన్, జోజి, ఏజేకే.పాల్‌లు ఎన్నికయ్యారు.

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

» ఆర్డీవో నర్సింహారావు



ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీవో నర్సింహారావు

ముదిగొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు సూచించారు. శనివారం ముదిగొండలోని రాఘవాపురం పోలింగ్ బూతును పరిశీలించి మాట్లాడారు. ఓటు హక్కుపై యువతకు అవగాహన కల్పించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఓటర్ జాబితాను పరిశీలించి సవరణల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఆర్ఐలు వహీదా, ప్రసన్నకుమార్, జూనియర్ అసిస్టెంట్ నాగూల్‌మీరా పాల్గొన్నారు.

వేంసూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): యువత ఓటుహక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఎంఏ.రాజు సూచించారు. శనివారం వేంసూరులోని పలు పోలింగ్ బూతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదుకు ఫారం 6, తొలగింపులకు ఫారం 7, సవరణల కోసం 8ఫారాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రంజిత్‌కుమార్, ఏఎస్‌వో సంపత్, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి వెండి తమలపాకుల బహూకరణ



మధిర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మధిర దివ్య షిర్డీ సాయి బాబా దేవాలయంలోని శ్రీప్రసన్నాంజనేయస్వామికి భక్తులు లక్షన్నర రూపాయల విలువచేసే వెండి తమలపాకులను శనివారం బహూకరించారు. పసూర గ్రూప్స్ చైర్మన్ పబ్బతి రవికుమార్, ఆలయ కోశాధికారి కురువెళ్ల కృష్ణ ఆధ్వర్యంలో భక్తుల ఆర్థిక సహకారంతో కేజీన్నరకు పైగా ఉన్న బరుతో తయారుచేసిన వెండి తమలపాకుల మాలను శ్రీఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు అలంకరించారు. ఈకార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వైరా మునిసిపాలిటీ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష



అధికారులు, ప్రతిపక్ష నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ అభివృద్ధిపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ శనివారం అధికారులు, ప్రతిపక్ష నాయకులతో చర్చించారు. వైరా మునిసిపాలిటీ అభివృద్ధి కోసం తామంతా కలిసికట్టుగా సహకరిస్తామని ఎమ్మెల్యేకు ప్రతిపక్షాల నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మునిసిపాలిటీలో చేపట్టనున్న రూ.వందకోట్ల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్షించారు. మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కమిషనర్ చింతా వేణు, వైరా సీఐ ఎన్.సాగర్, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు, మండల అధ్యక్షుడు కిలారు సురేందర్, సీపీఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, మాస్‌లైన్ నాయకుడు యలదండి బాబు, మునిసిపల్ డీఈ నరేష్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వీఎస్కే జన్మదిన వేడుకలు



వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఎర్రుపాలెం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండంలోని జమలాపురం గ్రామంలో గల బాలాజీనగర్ వృద్ధాశ్రమంలో వీఎస్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు వేజండ్ల సాయికుమార్ జన్మదిన వేడుకలు శనివారం నిర్వహించారు. జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఫౌండేషన్ నిర్వాహకులు కేక్‌కట్ చేసి వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వీఎస్కే ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్ కాపర్తి, భూక్యా గోపినాయ దస్తగిరి, యాదవ్, దినేష్‌రెడ్డి, ప్రశాంత్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎడ్లబండ్ల ద్వారా ఇసుక తోలకానికి అనుమతినివ్వాలి

» జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిరటౌన్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఎడ్లబండ్ల ద్వారా ఇసుక తోలకానికి అనుమతించాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు మధిర తహసీల్దార్ రాంబాబును కోరారు. ఇసుక తోలుతున్న ఎడ్లబండ్లను టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించడంతో కమల్‌రాజు ఎడ్లబండ్ల యజమానులను పరామర్శించి తహసీల్దార్ కు ఇసుక తొలకానికి అనుమతించాలని వినతి పత్రం అందచేశారు. గత 20 రోజులుగా మధిరలో స్థానిక రీచ్‌ల నుంచి ఇసుక తొలకాలకు అనుమతి నిలిపి వేయడంతో మధిరలో బవన నిర్మాణాలు నిలిచి పోయి కార్మికులు రోడ్డున పడ్డారని తెలిపారు. ఇసుక పాలసీని రూపొందించే వరకు ఎడ్లంబండ్లకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరావు బిఆర్ఎస్ రూరల్, పట్టణ కార్యదర్శులు బొగ్గుల భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీను, సొసైటీ అధ్యక్షుడు బిక్కి కృష్ణప్రసాద్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వై. వి. అప్పారావు, నాయకులు వంకాయలపాటి నాగేశ్వరరా వు, ప్యారి, కటికల సత్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి తదితరులున్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కమల్‌రాజు

తోపుడుబండి సాధిక్ కుటుంబానికి పరామర్శ



సాధిక్ అలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న క్రీసెంట్ ఫార్మా అధినేత జానీమియా

కల్లూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కల్లూరులో సామాజిక సేవకుడు తోపుడుబండి సాధిక్ ఇటీవల మృతి చెందగా, శనివారం పలువురు ప్రముఖులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. క్రీసెంట్‌ఫార్మా సంస్థ అధినేత యస్‌కె జానీమియా, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి చందర్ రావులు కాళోజీ నగర్‌లోని ఆయన నివాస గృహానికి వెళ్లి సాధిక్ సతీమణి ఉషాదయాళ్‌ను పరామర్శించారు. సాధిక్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్నేహ స్వచ్ఛంద సంస్థ అధినేత ఎండి ఫయాజ్, పీ ఆర్డీయూ నాయకుడు ఎండి. రియాజ్, కిషోర్‌దత్ దయాళ్ తదితరులున్నారు.

అనాథ బాలికలకు పుట్టినరోజు వేడుకలు



పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న అనాథ బాలికలు

పెనుబల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలచలక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 13మంది తల్లిదండ్రులు లేని బాలికలకు వీజీఎఫ్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులకు దుస్తులు అందించారు. కేక్ కట్‌చేయించి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వీజీఎఫ్ ట్రస్టు సభ్యులు బెల్లంకొండ శ్రీనివాసరావు, ఆళ్ల సూర్యనారాయణ, తోటకూర నాగేశ్వరరావు, బాజిని నర్సింహారావు, ఉపాధ్యాయురాళ్లు ప్రశాంతి, కృష్ణవేణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

కల్లూరు సీపీఎం కార్యదర్శిగా మాదాల

కల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) కల్లూరు సీపీఎం మండల కార్యదర్శిగా మాదాల వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామంలో సీపీఎం 9వ మండల మహాసభ నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యురాలు మాచర్ల భారతి, జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్, జిల్లా కమిటీ సభ్యులు చలమల విఠల్ సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా తన్నీరు కృష్ణార్జునరావు, ముదిగొండ అంజయ్య, తన్నీరు కృష్ణవేణి, గంప శ్రీనివాసరావు, దోమతోట్టి పుల్లయ్య, తెగుళ్ల బాబు, ఎ. వెంకటి, సామినేని హనుమంతరావు, ఆర్.నాగేశ్వరరావు, రామనాథం, బట్టు నరిసింహారావులను ఎన్నుకున్నారు.